www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 14 | శుక్రవారం | 14 ఆగస్టు, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 9014966169



## పదేళ్ల పాలన.. రెండేళ్ల పాలన

# తేడా చూడండి

### గత ప్రభుత్వ పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నాం

- పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యం
- తొలి విడతలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు
- కూకట్‌పల్లి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- 22 ఏ భూముల సమస్యను పరిష్కరిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. గత ప్రభుత్వంలో అమలైన పథకాలకు అదనంగా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. హైదరాబాద్‌లోని పీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. పేదల రుణం తీర్చుకునే అవకాశం తనకు లభించిందని రేవంత్‌రెడ్డి అన్నారు. కూకట్‌పల్లి ప్రజలు గతంలో తనను పార్లమెంట్ సభ్యుడిగా ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో నియోజకవర్గాన్ని ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయానని చెప్పారు. ప్రస్తుతం కూకట్‌పల్లి అభివృద్ధికి అవసరమైన అన్నిరకాల అధికారాలు తన చేతిలో ఉన్నాయని పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గానికి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి చేపట్టాలని మంత్రి శ్రీధర్‌బాబును ఆదేశిస్తున్నట్లు సీఎం తెలిపారు. ప్రజలకు ఏ అభివృద్ధి పని అవసరమైనా అడిగి చేయించుకోవాలని సూచించారు. కూకట్‌పల్లిని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

#### చేతబడులతో రాష్ట్రాన్ని ఆపలేరు

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రం ఎండిపోవాలని కొందరు కుట్రలు చేశారని ఆరోపించారు. తనపై, ప్రభుత్వంపై చేతబడులు, క్షుద్రపూజలు చేయించేందుకు కొందరు కర్ణాటకకు వెళ్లారని వ్యాఖ్యానించారు. 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. కొందరు క్షుద్రపూజలు చేశారు. చేసిన చేతబడి తిరిగి వారిపైనే ప్రభావం చూపుతుంది' అంటూ విమర్శించారు. ఫామ్‌హౌస్ నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. తన సంకల్పం తెలంగాణ బాగు కోసమేనని, రాష్ట్రంలో ప్రస్తుతం సమృద్ధిగా వర్షాలు తరువాయి 2లో..

## మైనారిటీ రిజర్వేషన్లపై

# కుట్రలు

- 4శాతం రిజర్వేషన్ల రద్దుకు కోర్టులకెక్కారు
- కాంగ్రెస్ లౌకిక విలువలకు కట్టుబడి ఉంది
- టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి ఉద్యోగాలు భర్తీ చేశాం
- సీఎం రేవంత్‌రెడ్డి



**ప్రజానావ, హైదరాబాద్:** ముస్లిం మైనారిటీలకు అమలు చేస్తున్న 4 శాతం రిజర్వేషన్లను అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించారని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్'లో సీఎం పాల్గొని వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. కాంగ్రెస్ హిందువులు, ముస్లింలను రెండు కళ్లలా చూస్తుందని, లౌకిక వర్గాల కోసం పోరాడుతుందని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మైనారిటీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ తరువాయి 2లో..



2

కూకట్‌పల్లిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేసిన ఇందిరమ్మ టవర్స్‌లో వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో విలువైన భూములపై పేదలకు కూడా బహుళ అంతస్తుల ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సీఎం శంకుస్థాపన అనంతరం నిర్వహించిన సభకు మంత్రి అధ్యక్షత వహించారు. గత ప్రభుత్వం కమిషన్లు వచ్చే ప్రాజెక్టులపై దృష్టి పెట్టి.. పేదల ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని పొంగులేటి ఆరోపించారు. ఇందిరమ్మ ప్రభుత్వం మాత్రం హైదరాబాద్‌లో ఎకరా రూ.200 కోట్ల వరకు విలువ చేసే భూముల్లోనూ పేదలకు ఇళ్లు నిర్మించేందుకు నిర్ణయించిందన్నారు.

# వచ్చే బోనాలు ఇందిరమ్మ టవర్స్‌లోనే..

- పేదల సొంతింటి కల సాకారం దిశగా మరో ముందడుగు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

## రాయదుర్గ్ భూముల

# వేలం ఆపాలి

- హెరిటేజ్ భూముల విక్రయంపై హరీశ్‌రావు ఫైర్
- ఆగస్టు 17, 21న జరిగే వేలాలను నిలిపివేయాలి
- సర్వే నం.83పై సమగ్ర విచారణకు డిమాండ్




2

## ఈసీఐ పేరుతో సైబర్ మోసాలు

- ఓటర్లకు ఫేక్ మెసేజ్‌లు
- రూ.5 చెల్లించాలంటూ మోసగాళ్ల వల
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీఈఓ సుదర్శన్‌రెడ్డి

2

## ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- వందేమాతరం ఆలాపనతో ఉభయసభలకు ముగింపు
- పలు బిల్లులకు ఆమోదం, విపక్షాల ఆందోళనలతో తరచూ వాయిదాలు
- 22 ఏళ్లలో అత్యంత పేలవంగా లోక్‌సభ పనితీరు: పీఆర్ఎస్

2

## గోదావరి జలాలపైనా

# ఏపీ కుట్రలు!

- 273 టీఎంసీలపై అక్రమ హక్కుల కోసం ప్రయత్నాలు
- 18న జీఆర్ఎంబీ భేటీని వేదికగా చేసుకునే యత్నం
- తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు ఏపీ లేఖలు
- టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కామెర నవీన్‌కుమార్
- కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తెలంగాణ రక్షణ సేన ఆగ్రహం




2

కృష్ణా జలాల తర్వాత ఇప్పుడు గోదావరి నీళ్లపైనా ఆంధ్రప్రదేశ్ కన్నేసిందని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకుడు కామెర నవీన్‌కుమార్ ఆరోపించారు. గోదావరిలోని 273 టీఎంసీలపై అక్రమ హక్కులు పొందేందుకు ఏపీ ప్రయత్నిస్తోందని, ఈ నెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశాన్ని ఇందుకు వేదికగా చేసుకుంటోందని విమర్శించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తుమ్మిడిహెట్టి, కాళేశ్వరం, చిన్న కాళేశ్వరం, చౌట్‌పల్లి హన్మంతరెడ్డి, చనాకా–కొరాట బ్యారేజీ, మోడికుంట వాగు, కడెం–గూడెం లిఫ్ట్, సీతమ్మసాగర్–సీతారామ ఎత్తిపోతల పథకాల అనుమతులను సమీక్షించి రద్దు చేయాలని ఏపీ కేంద్రానికి లేఖలు రాసిందన్నారు.




## ఎర్రకోటలో తొలిసారి

# వందేమాతరం

### ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక కార్యక్రమం

- 'వందేమాతరం' 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహణ
- గీతం అనంతరం జాతీయ గీతం ఆలాపన
- వికసిత్ భారత్ @2047 లక్ష్యానికి యువశక్తి భాగస్వామ్యంపై ప్రత్యేక దృష్టి

**న్యూఢిల్లీ:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల చరిత్రలో తొలిసారిగా ఎర్రకోటలో 'వందేమాతరం' గానం చేయనున్నారు. ఆగస్టు 15న జరిగే 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ గీతానికి ముందు 'వందేమాతరం' ఆలపిస్తారు. జాతీయ గీతానికి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ ఏడాది వేడుకలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. పతాకావిష్కరణ సమయంలో స్వదేశీ 105 ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్‌తో 21 తుపాకుల వందనం సమర్పిస్తారు. రెండు ఎంఐ–17 హెలికాప్టర్లతో పుష్పవర్షం నిర్వహించనున్నారు. పతాకావిష్కరణ అనంతరం ఆర్మీ బ్యాండ్ 'వందేమాతరం' స్వరాన్ని వినిపించనుంది. అనంతరం జాతీయ గీతం ఆలపిస్తారు. ప్రధాని ప్రసంగం ముగిసిన తర్వాత 2,500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు 'వందేమాతరం' ఆలపించి, ఆ తర్వాత జాతీయ గీతాన్ని పాడనున్నారు. జ్ఞాన్‌పథ్ వద్ద వారు 'వందేమాతరం' ఆకారంలో కూర్చోనున్నారు. వేడుకలకు వివిధ రంగాలకు చెందిన దాదాపు 5 వేల మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించారు. పీఎం ముద్రా యోజన మహిళా పారిశ్రామికవేత్తలు, మై భారత్ వాలంటీర్లు, పీఎంఏవై తరువాయి 2లో..



# ప్యాకెట్లపై హెచ్చరిక లేబుళ్లు తప్పనిసరి!

- మీరు చేయకపోతే మేమే చేస్తాం
- కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు
- కేంద్రానికి సుప్రీంకోర్టు గట్టి హెచ్చరిక

**న్యూఢిల్లీ:** అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్లపై స్పష్టమైన హెచ్చరిక లేబుళ్లు ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. ''మీరు చేయకపోతే మేమే చేస్తాం'' అని స్పష్టం చేసింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గవద్దని కేంద్రానికి సూచించింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. హెచ్చరిక లేబుళ్ల విషయంలో కేంద్రం, ఎఫ్ఎస్ఎస్ఏఐ వ్యవహరిస్తున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్యాకెట్ల ముందు భాగంలోనే అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వులపై స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరారు. హెచ్చరిక గుర్తులకు బదులుగా.. రోజువారీ వినియోగ పరిమితులను పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రతిపాదించినట్లు కోర్టుకు తెలిపారు. అయితే అది వినియోగదారులకు తగిన అవగాహన కల్పించదన్న వాదనలు ఉన్నాయి. గతంలో ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటి వరకు తీసుకున్న చర్యలేమిటని ధర్మాసనం కేంద్రాన్ని ప్రశ్నించింది. హెచ్చరిక లేబుళ్ల వల్ల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం చెప్పవచ్చని కోర్టు పేర్కొన్నప్పటికీ.. ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, తరువాయి 2లో..

# ఆర్ఎస్ఎస్, బీజేపీ జోకర్ల గుంపు

- భారత్ గురించి వారికి అవగాహన లేదు
- మోదీ విదేశాంగ విధానం 'ఆలింగనాల'కే పరిమితం
- ఆర్ఎస్ఎస్ పెద్ద పారిశ్రామికవేత్తలకు సాధనంగా మారింది
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- మోదీ, షా రాజీనామా చేసేవరకూ పోరాటం కొనసాగిస్తామని వెల్లడి

**న్యూఢిల్లీ:** ఆర్ఎస్ఎస్, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. 'వారు జోకర్ల గుంపు.. భారత్ చరిత్ర, తత్వం, వర్తమానంపై వారికి అవగాహన లేదు' అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో జరిగిన 'రచనాత్మక కాంగ్రెస్ నేషనల్ కన్వెన్షన్'లో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ విదేశాంగ విధానాన్ని రాహుల్ ఎద్దేవా చేశారు. ఇతర దేశాల నేతలను ఆలింగనం చేసుకోవడమే విదేశాంగ విధానమన్నట్లుగా మోదీ భావిస్తున్నారని విమర్శించారు. భారత ప్రయోజనాలను కాపాడటమే విదేశాంగ విధానం కావాలని అన్నారు. అమెరికా–ఇరాన్ యుద్ధం సమయంలో భారత్ మధ్యవర్తిత్వం చేసే అవకాశం ఉన్నప్పటికీ పాకిస్థాన్ ఆ స్థానాన్ని దక్కించుకుందని, మోదీ చూస్తూ ఉండిపోయారని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ తన అసలు స్వరూపాన్ని కోల్పోయి అదానీ, అంబానీ వంటి పెద్ద పారిశ్రామిక వేత్తలకు సాధనంగా మారిందని రాహుల్ ఆరోపించారు. గతంలో చిన్న వ్యాపార వర్గాలకు ప్రాతినిధ్యం వహించిన ఆర్ఎస్ఎస్ ఇప్పుడు పెద్ద మూలధనానికి సేవ చేస్తోందన్నారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని చెప్పారు. అయితే తమ పోరాటం ద్వేషం, హింసతో కాకుండా ప్రేమ, సోదరభావం, అహింసతో సాగుతుందని స్పష్టం చేశారు. జంతర్ మంతర్ విద్యార్థుల ఆందోళనను ప్రస్తావిస్తూ.. ప్రజల గొంతును 'క్రమశిక్షణ' పేరుతో అణచివేయడం సరికాదన్నారు.

### బీజేపీ ఎదురుదాడి

రాహుల్ వ్యాఖ్యలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పందిస్తూ.. ఎన్నికైన ప్రభుత్వాన్ని 'జోకర్లు, క్లౌన్లు' అనడం రాహుల్ అపరిపక్వతకు నిదర్శనమన్నారు. ప్రజల తీర్పును గౌరవించి, ప్రధాని మోదీని అవమానించడం మానుకోవాలని సూచించారు.

# ప్రసంగించిన వేదికను శుద్ధి చేయడమేంటి?

- హల్ద్వానీలో ఘటనపై ఖర్గే ఆగ్రహం
- అంటరానితనం నిరోధక చట్టం కింద కేసులు పెట్టి అరెస్టు చేయాలి
- బీజేపీ ఇలాంటి చర్యలను సమర్థించదు: నడ్డా
- ఘటనపై దర్యాప్తు చేస్తామని హామీ
- ఖండించిన రాజ్యసభ చైర్మన్



**న్యూఢిల్లీ:** ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో తాను ప్రసంగించిన వేదికను బీజేపీకి చెందిన వ్యక్తులు 'శుద్ధి' చేయడంపై రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తనను అవమానించడమేనని పేర్కొన్న ఆయన.. వేదికను శుద్ధి చేసిన వారిపై అంటరానితనం నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి, అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. వర్షాకాల సమావేశాల చివరి రోజైన గురువారం రాజ్యసభలో ఈ అంశాన్ని ఖర్గే ప్రస్తావించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనే మాట్లాడానని స్పష్టం చేశారు. అయితే తన ప్రసంగం అనంతరం బీజేపీకి చెందిన కొందరు అక్కడ హవనం నిర్వహించి, తాను మాట్లాడిన వేదికను 'శుద్ధి' చేశారని ఖర్గే ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు చోటు ఉందా? రాజ్యాంగాన్ని ఎలా పరిరక్షిస్తున్నారని ప్రశ్నించారు. ఈ ఘటనను రాజకీయంగా ఉపయోగించుకోవడం తన ఉద్దేశం కాదని, అయితే వేదికను శుద్ధి చేయడం ద్వారా తనను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు.

### విచారణ జరిపిస్తాం

ఖర్గే లేవనెత్తిన అంశంపై స్పందించాలని రాజ్యసభ చైర్మన్ సి.పీ. రాధాకృష్ణన్ సభా నాయకుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కోరారు. దీనిపై నడ్డా స్పందిస్తూ.. ఇలాంటి చర్యలను బీజేపీ ఏమాత్రం సమర్థించదని స్పష్టం చేశారు. ఘటనపై విచారణ జరిపిస్తామని తెలిపారు. 'ఇది కాంగ్రెస్‌కు మాత్రమే కాదు.. మనందరికీ బాధాకరమైన ఘటన. బీజేపీ ఇలాంటి చర్యలను సమర్థించదు. దీనిపై దర్యాప్తు చేస్తాం. ఈ ఘటనను ఖండిస్తున్నాను' అని నడ్డా పేర్కొన్నారు. ఇక ఇదే ఘటనను రాజ్యసభ చైర్మన్ సి.పీ. రాధాకృష్ణన్ కూడా ఖండించారు. దీనిపై ప్రభుత్వం సమగ్రంగా దర్యాప్తు చేయాలని సూచించారు. ఖర్గే ప్రసంగంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం, నినాదాలతో సభలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# ఈసీఐ పేరుతో సైబర్ మోసాలు

- ఓటర్లకు ఫేక్ మెసేజ్‌లు
- రూ.5 చెల్లించాలంటూ మోసగాళ్ల వల
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీఈఓ సుదర్శన్‌రెడ్డి



**ప్రజానావ, హైదరాబాద్:** భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పేరుతో ఓటర్లకు సైబర్ మోసగాళ్లు మోసపూరిత సందేశాలు పంపుతున్నారని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. ఓటరు వివరాలు సరిపోలడం లేదంటూ ఫేక్ మెసేజ్‌లు పంపి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇలాంటి సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటరు దరఖాస్తు తిరస్కరణకు గురైందని, దాన్ని సరిచేయాలంటే రూ.5 చెల్లించాలని సైబర్ నేరగాళ్లు కోరుతున్నట్లు సీఈఓ తెలిపారు. వాట్సాప్ ద్వారా పంపుతున్న లింక్‌పై క్లిక్ చేసి దరఖాస్తు పూర్తి చేయాలని చెబుతున్నారని పేర్కొన్నారు. ఆ లింకుల ద్వారా బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఇతర వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారని వెల్లడించారు. ఇలాంటి ఫేక్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు ఈసీఐ లేదా తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి పంపించేవి కావని సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. గుర్తుతెలియని లింకులపై క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. మోసపూరిత సందేశాలు లేదా కాల్స్ వస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

# గోదావరి జలాలపైనా ఏపీ కుట్రలు!

- 273 టీఎంసీలపై అక్రమ హక్కుల కోసం ప్రయత్నాలు
- 18న జీఆర్ఎంబీ భేటీని వేదికగా చేసుకునే యత్నం
- తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు ఏపీ లేఖలు
- టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కామెర నవీన్‌కుమార్
- కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తెలంగాణ రక్షణ సేన ఆగ్రహం



**ప్రజానావ, హైదరాబాద్:** కృష్ణా జలాల తర్వాత ఇప్పుడు గోదావరి నీళ్లపైనా ఆంధ్రప్రదేశ్ కన్నేసిందని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకుడు కామెర నవీన్‌కుమార్ ఆరోపించారు. గోదావరిలోని 273 టీఎంసీలపై అక్రమ హక్కులు పొందేందుకు ఏపీ ప్రయత్నిస్తోందని, ఈ నెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశాన్ని ఇందుకు వేదికగా చేసుకుంటోందని విమర్శించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తుమ్మిడిహెట్టి, కాళేశ్వరం, చిన్న కాళేశ్వరం, చౌటపల్లి హన్మంతరెడ్డి, చనాకా–కొరాట బ్యారేజీ, మోడికుంట వాగు, కడెం–గూడెం లిఫ్ట్, సీతమ్మసాగర్–సీతారామ ఎత్తిపోతల పథకాల అనుమతులను సమీక్షించి రద్దు చేయాలని ఏపీ కేంద్రానికి లేఖలు రాసిందన్నారు. సమ్మక్క సాగర్ బ్యారేజీకి అనుమతులు ఇవ్వొద్దని కూడా కోరిందని తెలిపారు. గోదావరి–బనకచర్ల లింక్ ద్వారా కృష్ణా, పెన్నా బేసిన్‌లోని ప్రాజెక్టులకు 250 టీఎంసీలను తరలించే ప్రయత్నం జరుగుతోందని నవీన్‌కుమార్ ఆరోపించారు. ఏపీకి హక్కుగా వచ్చే 480 టీఎంసీలను వినియోగించుకోవడంపై అభ్యంతరం లేదని, తెలంగాణ నీటి హక్కులపై జోక్యం చేసుకుంటే మాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ఏపీ అభ్యంతరాలను జీఆర్ఎంబీ ఎజెండాలో చేర్చడం అన్యాయమన్నారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడడంలో రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగా మేల్కొందని విమర్శించారు.

### బీఆర్ఎస్‌పై 'క్రెడిట్ చోరీ' ఆరోపణ

ఈ అంశాన్ని ముందుగానే తమ పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని, ఆ తర్వాతే ప్రభుత్వం సమీక్షలు ప్రారంభించిందని చెప్పారు. ఇప్పుడు బీఆర్ఎస్ తమ వల్లే ప్రభుత్వం కదిలిందన్నట్లుగా క్రెడిట్ తీసుకునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్రం తెలంగాణ జల హక్కులను కాపాడాలని, గోదావరి జలాల్లో రాష్ట్ర వాటాను తేల్చాలని డిమాండ్ చేశారు. ఏపీ కుట్రలను అడ్డుకునేందుకు అవసరమైతే కేంద్ర జలశక్తి శాఖకు లక్షలాది లేఖలు పంపి పోరాటం చేస్తామని నవీన్‌కుమార్ హెచ్చరించారు.

# పదేళ్ల పాలన.. రెండేళ్ల పాలన తేడా చూడండి

(మొదటిపేజీ తరువాయి)

కురుస్తున్నాయని చెప్పారు. 'పదే ళ్లు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తా రా?' అని ప్రశ్నించారు. మా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని సీఎం తెలిపారు.

### అప్పులు చెల్లిస్తూనే సంక్షేమం

గత ప్రభుత్వం చేసిన అప్పులను ఒకవైపు చెల్లిస్తూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని సీఎం చెప్పారు. తెలంగాణలో 3.28 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించామని పేర్కొన్నారు.

### తొలి విడతలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు

పట్టణ ప్రాంతాల్లో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. తొలి విడతలో లక్ష ఇళ్లను నిర్మించి ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. 'పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా అండగా ఉంటా' అని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పినా.. కూకట్‌పల్లిలో కనీసం ఒక్కరికైనా ఇల్లు ఇచ్చిందా? అని ప్రశ్నించారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఇక 22 ఏ భూముల సమస్యపైనా సీఎం స్పందించారు. ప్రజలు కొనుగోలు చేసిన భూములు పొరపాటున 22 ఏ నిషేధిత జాబితాలో చేరితే వాటిని పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. 'ఈ విషయంలో నాదే పూచీ' అని స్పష్టం చేశారు. ఒక సర్వే నంబర్‌లో 500 ఎకరాల భూమి ఉంటే.. అందులో సమస్య ఉన్న కొంత భూమి కారణంగా మొత్తం భూమిని నిషేధిత జాబితాలో చేర్చిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. సబ్ నంబర్లు కేటాయించి సమస్యను పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు.

# ఖనిజాలపై రాష్ట్రాల 'పన్ను'కు కళ్లెం!

- గనులు, ఖనిజాల సవరణ బిల్లుకు పార్లమెంటు ఆమోదం
- రాష్ట్రాల ఆదాయానికి నష్టం ఉండదు
- ప్రధాన ఖనిజాల నియంత్రణ కేంద్రం చేతుల్లోకి
- దేశవ్యాప్తంగా ఖనిజాల రేట్లలో ఏకరూపతే లక్ష్యం
- కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



**న్యూఢిల్లీ:** ఖనిజ హక్కులు, ఖనిజాలు కలిగిన భూములపై రాష్ట్రాలు పన్నులు విధించే అధికారాలను పరిమితం చేసే గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు–2026కు పార్లమెంటు ఆమోదం తెలిపింది. లోక్‌సభ బుధవారం బిల్లును ఆమోదించగా.. రాజ్యసభ గురువారం ఆమోదంతో పార్లమెంటరీ ప్రక్రియ పూర్తయింది. రాష్ట్రపతి ఆమోదం లభించిన అనంతరం ఇది చట్టంగా అమల్లోకి రానుంది. రాజ్యసభలో బిల్లుపై జరిగిన చర్చకు కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి సమాధానమిచ్చారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి, ఆదాయ హక్కులను దెబ్బతీయడం బిల్లు ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఖనిజాల ధరలు, రేట్లలో ఏకరూపత తీసుకురావడమే సవరణల ప్రధాన లక్ష్యమని తెలిపారు. బొగ్గు, సున్నపురాయి, ఇనుప ఖనిజం, రాగి, మాంగనీస్ తదితర ప్రధాన ఖనిజాల నియంత్రణను కేంద్రం చేపడుతుందని చెప్పారు. అదే సమయంలో 49 రకాల చిన్న ఖనిజాలపై రాష్ట్రాల అధికారాలు యథావిధిగా కొనసాగుతాయని వివరించారు.

### విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గుదే కీలకపాత్ర

దేశ విద్యుత్ ఉత్పత్తిలో 73 శాతం బొగ్గుపైనే ఆధారపడి ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ మార్కెట్‌లో భారత పరిశ్రమలు పోటీపడాలంటే నిరంతర విద్యుత్ సరఫరా ఎంతో కీలకమని పేర్కొన్నారు. గత కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వ హయాంలో బొగ్గు బ్లాకుల కేటాయింపుల్లో అక్రమాలు, అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. గత 12 ఏళ్లుగా ఖనిజాల కేటాయింపులు పారదర్శకంగా వేలం విధానంలోనే జరుగుతున్నాయని చెప్పారు. గతంలో మాదిరిగా నామినేషన్ పద్ధతిలో ఒక్క బ్లాక్‌ను కూడా కేటాయించలేదని స్పష్టం చేశారు.

### రాష్ట్రాల ఆదాయ వాటా పెరిగింది

2014–15లో ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయంలో రాష్ట్రాల వాటా 65 శాతం ఉండగా.. ప్రస్తుతం అది 85 శాతానికి పెరిగిందని మంత్రి తెలిపారు. బొగ్గు ద్వారా వచ్చే ఆదాయంలో రాష్ట్రాల వాటా 51 శాతం నుంచి 96 శాతానికి చేరిందన్నారు. ఖనిజాల ద్వారా వచ్చే మొత్తం ఆదాయంలో కేంద్రానికి సుమారు 11 శాతం మాత్రమే లభిస్తుండగా.. దాదాపు 88 శాతం రాష్ట్రాలకే వెళ్తోందని కిషన్‌రెడ్డి వివరించారు. తాజా సవరణల వల్ల ఏ రాష్ట్రానికీ ఆదాయ నష్టం ఉండదని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణకు సంబంధించి చట్టాలు చేసే అధికారం రాజ్యాంగంలోని యూనియన్ జాబితాలోని ఎంట్రీ–54 ద్వారా పార్లమెంటుకు ఉందని పేర్కొన్నారు.

### విపక్షాల నినాదాల మధ్య ఆమోదం

వర్షాకాల సమావేశాల ప్రారంభం నుంచి వివిధ అంశాలపై విపక్ష సభ్యులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వైద్య విద్య ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీకి నిరసనగా ఆందోళన చేసిన విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభకు వచ్చి సమాధానం చెప్పాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. అయోధ్య రామమందిరానికి సమర్పించిన విరాళాల నిధులు చోరీ అయ్యాయన్న ఆరోపణలపై కూడా సభ్యులు నినాదాలు చేశారు. విపక్ష సభ్యుల నినాదాల మధ్యే కిషన్‌రెడ్డి బిల్లుపై సమాధానం ఇచ్చారు. అనంతరం బిల్లును రాజ్యసభ సెలెక్ట్ కమిటీకి పంపాలంటూ డీఎంకే సభ్యుడు తిరుచ్చి శివా ప్రతిపాదించిన సవరణను సభ వాయిస్ ఓటుతో తిరస్కరించింది. సవరణపై ఓటింగ్ నిర్వహించాలని కొందరు విపక్ష సభ్యులు కోరినప్పటికీ.. సభలో గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో డివిజన్ నిర్వహించడం సాధ్యం కాదని రాజ్యసభ చైర్మన్ సి.పీ. రాధాకృష్ణన్ తెలిపారు.

# 22 ఏళ్లలో అత్యంత పేలవంగా లోక్‌సభ పనితీరు

- వర్షాకాల సమావేశాల్లో 15 శాతమే కార్యకలాపాలు
- 2004 తర్వాత 2010, 2013 సమావేశాల్లోనే ఇంతకంటే తక్కువ
- రాజ్యసభ 33శాతం సమయం మాత్రమే పనిచేసిందన్న పీఆర్ఎస్

**న్యూఢిల్లీ:** ముగిసిన వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ పనితీరు గత 22 ఏళ్లలోనే అత్యంత పేలవంగా నమోదైంది. షెడ్యూల్ చేసిన సమయం తో పోలిస్తే సభ కేవలం 15 శాతం మాత్రమే పని చేసిందని పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ గణాంకాలు వెల్లడించాయి. 2004 తర్వాత 2010, 2013 శీతా కాల సమావేశాల్లో మాత్రమే ఇంతకంటే తక్కువ పనితీరు నమోదైంది. 2010 శీతాకాల సమావేశాల్లో లోక్‌సభ 5 శాతం, రాజ్యసభ కేవలం 2 శాతం సమయం పనిచేశాయి. 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపు లపై జేపీసీ దర్యాప్తు కోరుతూ విపక్షాల ఆందోళ నలతో సభ స్తంభించింది. 2013లో ఆంధ్రప్రదేశ్ విభజన, తెలంగాణ ఏర్పాటు, బొగ్గు కేటాయిం పులపై నిరసనలతో లోక్‌సభ 8 శాతం, రాజ్యసభ 19 శాతం మాత్రమే పనిచేశాయి. ప్రస్తుత సమావే శాల్లో రాజ్యసభ 33 శాతం సమయం పనిచేసిందని పీఆర్ఎస్ తెలిపింది. అయితే పార్లమెంటరీ వ్యవహా రాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకారం లోక్‌సభ పనితీ రు 19 శాతం, రాజ్యసభది 39 శాతంగా ఉంది. వాస్తవంగా పనిచేసిన గంటలను నిర్ణీత సమావేశ సమయంతో పోల్చి పీఆర్ఎస్ గణాంకాలను రూపొందిస్తుందని సంస్థ వివరించింది.

### 148 శాతానికి చేరిన సందర్భాలు..

2014 తర్వాత లోక్‌సభ పనితీరు 2024 ఫిబ్రవరి బడ్జెట్ సమావేశాల్లో 148 శాతంతో అత్య ధికంగా నమోదైంది. 2020 వర్షాకాల సమావేశాల్లో 145 శాతం, 2023 ప్రత్యేక సమావేశాల్లో 137 శాతం నమోదయ్యాయి. రాజ్యసభ 22 ఏళ్లలో అత్యధికంగా 2024 ఫిబ్రవరి బడ్జెట్ సమావేశాల్లో 137 శాతం పనిచేసింది. 2016లో పెద్ద నోట్ల రద్దుపై విభేదాలతో లోక్‌సభ పనితీరు 15 శాతానికి పడిపోయింది.

# ప్యాకెట్లపై హెచ్చరిక లేబుళ్లు తప్పనిసరి!

(మొదటిపేజీ తరువాయి)

సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నా ఉత్పత్తిని కొనాలా వద్దా అనేది వినియోగదారుడి నిర్ణయమని తెలిపింది. హెచ్చరిక లేబుళ్ల ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

# ఎర్రకోటలో తొలిసారి వందేమాతరం

(మొదటిపేజీ తరువాయి)

లబ్ధిదారులు, వీధి వ్యాపారులు తదితరులు ఇందు లో ఉన్నారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి మరో 1,500 మందికిపైగా సంప్రదాయ దుస్తుల్లో హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా దేశభక్తి భావనను పెంపొందించేందుకు 343 ప్రాంతాల్లో సైన్యం, నౌకాదళం, వైమానిక దళం, కోస్ట్‌గార్డ్, ఎన్‌సీసీ, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ తదితర బలగాల బ్యాండ్లు ప్రత్యేక ప్రదర్శనలు ఇవ్వనున్నాయి.

# రాయదుర్గ్ భూముల వేలం ఆపాలి

**ప్రజానావ, హైదరాబాద్:** ప్రభుత్వ, హెరిటేజ్ భూములను వరుసగా వేలం వేస్తున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేశారు. ప్రభుత్వ భూములు తెలంగాణ జాతి సంపద అని గతంలో చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు వాటినే అమ్మకానికి పెడుతున్నారని ఆరోపిస్తూ సీఎంకు లేఖ రాశారు. రాయదుర్గ్ పాన్మక్త గ్రామంలోని సర్వే నంబర్ 83/1లోని 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో వేలం వేయడాన్ని హరీశ్‌రావు తీవ్రంగా వ్యతిరేకించారు. 2020లో ఇదే భూముల రక్షణ కోసం రేవంత్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారని గుర్తుచేస్తూ.. ప్రతిపక్షంలో ఒక మాట, అధికారంలో మరో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలను ఎకరాకు సుమారు రూ.237 కోట్ల చొప్పున వేలం వేయగా ఎస్‌బీఐ కోర్టును ఆశ్రయించిందని, ఈ వ్యవహారం ప్రస్తుతం హైకోర్టు పరిధిలో ఉందని తెలిపారు. అయినా అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం ఎందుకని ప్రశ్నించారు. భూమిపై వివాదాలు ఉన్నప్పుడు హక్కులు తేల్చకుండా వేలం వేయడం సమంజసం కాదన్నారు. సుమారు రూ.2 వేల కోట్ల విలువైన భూములను విక్రయించే హక్కు ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని నిలదీశారు.

### భవిష్యత్తులో సమస్యలు

ఆగస్టు 17, 21 తేదీల్లో జరగనున్న వేలాలను వెంటనే నిలిపివేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులను పరిశీలించి సమగ్ర విచారణ జరపాలని కోరారు.

# వచ్చే బోనాలు ఇందిరమ్మ టవర్స్‌లోనే

- పేదల సొంతింటి కల సాకారం దిశగా మరో ముందడుగు
- తొలి విడతలో లక్ష ఇళ్లు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



**ప్రజానావ, హైదరాబాద్:** కూకట్‌పల్లిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేసిన ఇందిరమ్మ టవర్స్‌లో వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో విలువైన భూములపై పేదలకు కూడా బహుళ అంతస్తుల ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సీఎం శంకుస్థాపన అనంతరం నిర్వహించిన సభకు మంత్రి అధ్యక్షత వహించారు. గత ప్రభుత్వం కమిషన్లు వచ్చే ప్రాజెక్టులపై దృష్టి పెట్టి.. పేదల ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని పొంగులేటి ఆరోపించారు. ఇందిరమ్మ ప్రభుత్వం మాత్రం హైదరాబాద్‌లో ఎకరా రూ.200 కోట్ల వరకు విలువ చేసే భూముల్లోనూ పేదలకు ఇళ్లు నిర్మించేందుకు నిర్ణయించిందన్నారు. పేదల కోసం అవసరమైతే తల తాకట్టు పెట్టయినా ఇళ్ల నిర్మాణాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తొలి విడతగా రాష్ట్రంలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సంకల్పించిందని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుందని చెప్పారు. అనంతరం ఎలాంటి సిఫార్సులు, లాలూచీలు లేకుండా మంత్రుల సమక్షంలో పారదర్శకంగా లక్కీడిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని వెల్లడించారు. లబ్ధిదారులకు ముందుగానే ఇళ్ల వివరాలు అందిస్తామని, వారు కాంట్రాక్టర్లతో కలిసి నిర్మాణ నాణ్యతను స్వయంగా పర్యవేక్షించుకో వచ్చని సూచించారు. ఇలాంటి భారీ కార్యక్రమాన్ని గత ప్రభుత్వ నాయకులు జీర్ణించుకోలేక ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

### గతం కంటే మూడింతలు ఇళ్లు నిర్మిస్తాం

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 2 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే తమ ప్రభుత్వం రెండున్నరేళ్లలో మూడు రెట్లు ఎక్కువ ఇళ్లు నిర్మిస్తుందని మరోసారి ప్రకటించారు. ఆ లక్ష్యాన్ని సాధించకపోతే తాను వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయనని సవాల్ చేశారు. పేదల ఆత్మగౌరవాన్ని కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**న్యూఢిల్లీ:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు గురువారం ముగిశాయి. లోక్‌సభ, రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడటంతో సమావేశాలకు తెరపడింది. లోక్‌సభ ప్రారంభమైన అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సహా సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. ఇటీవల వందేమాతరం గేయానికి చట్టపరమైన రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపిన నేపథ్యంలో పార్లమెంటులో ఈ గేయాన్ని ఆలపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. వందేమాతరాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని చట్టం పేర్కొంటున్నట్లు సమాచారం. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గతంలో మార్గదర్శకాలు జారీ చేసింది. జూలై 20న ప్రారంభమైన వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13తో ముగిశాయి. సమావేశాల సందర్భంగా పలు కీలక బిల్లులకు పార్లమెంటు ఆమోదం తెలిపింది.

### లాఠీఛార్జ్‌పై విపక్షాల ఆందోళన

ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో పార్లమెంటులో కేంద్రం స్పష్టం చేయాలని కాంగ్రెస్ సహా విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ అంశంతోపాటు పలు ఇతర సమస్యలపై సభ్యులు ఆందోళనకు దిగడంతో ఉభయసభల్లో తరచూ వాయిదాల పర్వం కొనసాగింది.

# మైనారిటీ రిజర్వేషన్లపై కుట్రలు

(మొదటిపేజీ తరువాయి)

కల్పించిన 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేయాలని కొందరు కోర్టులను ఆశ్రయించారని, గుజరాత్‌లో మైనారిటీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రూప్–1 పరీక్షలు, నియామకాలను సక్రమంగా నిర్వహించలేకపోయిందని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి విద్యావంతులను నియమించిందని, యూపీఎస్సీ తరహాలో బలోపేతం చేశామని తెలిపారు. రిటైర్డ్ డీజీపీని చైర్మన్‌గా నియమించి పారదర్శకంగా గ్రూప్–1 పరీక్షలు నిర్వహించి నియామకాలు పూర్తి చేశామని చెప్పారు. గ్రూప్–1 నియామకాలను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించినా.. న్యాయపరంగా పోరాడి నియామకాలు పూర్తి చేశామని తెలిపారు. గ్రూప్–2, 3, 4 పోస్టుల భర్తీని కూడా పూర్తి చేశామని పేర్కొన్నారు.

### ఓటు హక్కును కాపాడండి

ఓటర్ల జాబితా సవరణ పేరుతో కొందరు ఓట్లు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణను తదుపరి లక్ష్యంగా చేసుకున్నారని కొందరు మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలు గల్లీగల్లీ, ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించి ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాలని పిలుపునిచ్చారు.

### నిఖత్, సిరాజ్‌కు ఉద్యోగాలు

బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్–1 ఉద్యోగంతో పాటు రూ.3 కోట్ల ప్రోత్సాహకం ఇచ్చామని, క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం తెలిపారు. మైనారిటీ యువత చదువుతోపాటు నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నైపుణ్యాలున్న వారికి అవకాశాలు ఉన్నాయని, యువత కోసం స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని చెప్పారు.



# అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల**

**ప్రజానావ, పెద్దపల్లి :** మరణం తర్వాత కూడా తోటి వారికి ప్రాణదానం చేసే గొప్ప అవకాశం నేత్ర దానం, అవయవదానమని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి సునీత కుంచాల అన్నారు. ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకొని సదాశయ ఫౌండేషన్, తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల సంఘం ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సౌజన్యంతో గురువారం పట్టణ మున్సిపల్ పరిధిలోని రంగంపల్లి జిల్లా కోర్టు ఆవరణలో నేత్రదా నం, అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల హాజరై మాట్లాడుతూ నేత్రదానం, శరీర అవయవాల దానం పట్ల సమాజంలో ఉన్న అపోహలను తొలగిం చుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. పెద్దపల్లి జిల్లాలోని ఓదెల గ్రామం నేత్రదానంలో ఆదర్శంగా నిలవడం అభినందనీ యం అన్నారు. గ్రామంలో ఎవరైనా మరణించినప్పుడు నేత్రదానం చేయాలనే నిర్ణయాన్ని సమిష్టిగా తీసుకున్న ఆ గ్రామస్తుల ఐకమత్యం అందరికీ ఆదర్శమని, ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన భీష్మాచారి కృషిని ఆమె కొనియాడారు. నేత్రదానం అంటే కళ్ళు మొత్తం తీసేస్తారనే అపోహ చాలామందిలో ఉందని, కానీ, అది వాస్తవం కాదని, కేవలం అవసరమైన రెటీనా చిన్న పొరను మాత్రమే తీసుకుంటారని, దీనివల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదని ఆమె స్పష్టం చేశారు. అనారోగ్యంతో పాటు ప్రమాదాల్లో బ్రెయిన్ డెడ్ అయి న వారి అవయవాలను సేకరించడం ద్వారా మరో కొంత మంది ప్రాణాలను కాపాడవచ్చని, మరణానం తరం కూడా మనం జీవించే ఉండడానికి ఇదొక ఉత్తమ మార్గమని ఆమె వివరించారు. అవయవ దానానికి మనం సిద్ధపడాలంటే, ముందుగా మనం ఆరోగ్యంగా ఉండాలిని, సరైన ఆహారపు అలవాట్లతో జంక్ ఫుడ్ కు దూరంగా ఉంటూ, జీవనశైలిని క్రమబద్ధీకరించు కోవాలని సూచించారు. అడ్వకేట్ అశోక్ రెడ్డి,ఆయన సతీమణి రమాదేవి తమ శరీరాలను దానం చేయ డానికి ముందుకు రావడం అభినందనీయమని, వారు సమాజానికి నిలువెత్తు నిదర్శనమని, ఆ దంపతు లిద్దరిని శాలువాతో ఘనంగా సత్కరించి ప్రశంసిం చారు. ఈ కార్యక్రమంలో ఫోక్సో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచం స్వప్న రాణి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వంగర భవాని, జూనియర్ సివిల్ జడ్జి ఎన్. మంజుల, డీసీపీ భూక్య రామ్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొంకెన రవీందర్,ఎస్ఐ కే. నరేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల మల్లేశం, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రావణ్ కుమార్ భీష్మాచారి, పలువురు న్యాయవాదులు, సదాశయ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.








## శశికిరణ్ కొమాండూర్ శ్రీమద్రామాయణంకు

# తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం

- నైతిక విలువలతో సాగుతున్న సాహితీ ప్రస్థానానికి గుర్తింపు..
- లోక్‌భవన్‌లో ఘన సత్కారం

**ప్రజానావ, హైదరాబాద్:** ప్రముఖ కవి, తెలంగాణ గవర్నర్ జాయింట్ సెక్రటరీ, సీనియర్ గ్రూప్–1 అధికారి శశికిరణ్ కొమాండూర్ రచించిన పద్య మహాకావ్యం 'శ్రీమద్రామాయణం' 2024 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి ఎంపికైంది. పరిపాలనా బాధ్యతలను నిర్వహిస్తూనే గత రెండు దశాబ్దాలుగా సాహిత్య సాధన కొనసాగిస్తున్న శశికిరణ్ కొమాండూర్.. సామాన్య పాఠకుడికి సైతం సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో, ఛందోబద్ధంగా 'శ్రీమద్రామాయణం'ను రచించారు. ప్రముఖ ప్రచురణ సంస్థ ఎమెస్కో ఈ మహాకావ్యాన్ని ప్రచురించింది. సాహితీవేత్తగా ప్రత్యేక గుర్తింపు పొందిన శశికిరణ్ కొమాండూర్ వ్యక్తిగత జీవితంలోనూ అత్యున్నత నైతిక విలువలు, నిజాయి తీకి ప్రాధాన్యమిచ్చే అధికారిగా పేరొందారు. గతంలో భారత ప్రభుత్వ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారానికి ఆయనను పరిశీలించినప్పటికీ, ఆ అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించారు. ఆ సమయంలో తాను సంబంధిత కేంద్ర మంత్రి వద్ద విధులు నిర్వహిస్తున్నందున, ఏ చిన్న విమర్శకు కూడా తావివ్వకూడదన్న ఉద్దేశంతో పదవిలో ఉన్న సమయంలో తన శాఖ నుంచి అవార్డు స్వీకరించడం నైతికం కాదని భావించి ఆ పురస్కారాన్ని స్వీకరించేం దుకు అంగీకరించలేదు. నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ తనదైన సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న శశికిరణ్ కొమాండూర్‌కు తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం లభించడం పట్ల కవులు, రచయితలు, ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి ఎంపికైన శశికిరణ్ కొమాండూర్‌ను గ్రూప్–1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, గవర్నర్ ఉప కార్యదర్శి జి.పల్లవి, ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం, సమన్వయ అధికారి మురళీచార్యులు, అకౌంట్ ఆఫీసర్ శైలజ, అసిస్టెంట్ కంప్ట్రోలర్ జెడ్.హెరాల్డ్ డేవిడ్, ఉద్యానవన అధికారిణి మాలిని, డీఈఈ శ్రీధర్, సెక్షన్ ఆఫీసర్ ఎస్.రామచంద్రం, సాంఖ్యక అధికారి శ్రీకాంత్, ఏఈఈలు హర్షవర్ధన్, త్రిషలు లోక్‌భవన్‌లో ఘనంగా సత్కరించారు. లోక్‌భవన్ ఉద్యోగులు, సిబ్బంది కూడా ప్రత్యేకంగా శశికిరణ్ కొమాండూర్‌ను కలిసి అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# శ్రావణమాసంలోనైనా.. రాజన్న భక్తులకు దర్శనం కల్పించాలి

**కలెక్టర్‌కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి వినతి**

**ప్రజానావ, సిరిసిల్ల :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అభివృద్ధి పనుల పేరుతో గత తొమ్మిది నెలలుగా భక్తులకు స్వామి వారి దర్శనాన్ని పరిమితం చేయడం, నిలిపివేయడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి అన్నారు. శ్రావణమాసంలోనైనా భక్తులందరికీ రాజన్న దర్శన భాగ్యం కల్పించాలని కోరుతూ గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కు ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భం గా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ, గత తొమ్మిది నెలలుగా రాజన్న దర్శనం కోసం ఎదురుచూస్తున్న భక్తులకు ఇకపై మరింత జాప్యం చేయకుండా ఈ శ్రావణమాసంలోనే శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దర్శనానికి అవకాశం కల్పించాలని భారతీయ జనతా పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఆలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నప్పటికీ భక్తుల ఆధ్యాత్మిక భావోద్వేగాలను, విశ్వాసాలను దృష్టిలో ఉంచుకుని దర్శనానికి తగిన ప్రత్యామ్నాయ ఏర్పా ట్లు చేయాలని అధికారులను కోరారు. శ్రావణ మాసం అత్యంత పవిత్రమైన మాసమని, ఈ సమ యంలో రాజన్నను దర్శించు కోవాలని లక్షలాది మంది భక్తులు కోరుకుంటారని పేర్కొంటూ, భక్తుల విశ్వాసాన్ని గౌరవించి వెంటనే దర్శన ఏర్పాట్లు కల్పించాలని బీజేపీ తరఫున రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

# మహిళా శక్తిని వ్యాపార శక్తిగా మార్చడమే లక్ష్యం

- ములుగు పర్యాటక సంపద మహిళల ఆర్థికాభివృద్ధికి అవకాశాల గని
- మహిళా వ్యాపారాలకు కొత్త దిశగా 'ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్': మంత్రి సీతక్క




**ప్రజానావ, ములుగు:** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం సహాయక సంఘాల సభ్యులను విజయవంతమైన పారిశ్రా మికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, మహిళా వ్యాపారాలకు కొత్త దిశగా 'ఇంక్యుబే టర్ ప్రోగ్రామ్' నూతన వేదికగా మారుతుందని పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ తెలంగాణ ఆధ్వర్యంలో బిట్స్ పిలానీ హైదరాబాద్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ అవగాహన, ప్రణాళిక కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ప్రజా ప్రభు త్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతమైతే కుటుంబం బాగుపడుతుందని, కుటుంబాలు బాగుంటే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళల సామర్థ్యంపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి అపారమైన నమ్మకం ఉందని, అందుకే మహిళా సంఘాలకు వివిధ వ్యాపార, ఉపాధి అవకాశాలను కల్పిస్తూ వారిని పారిశ్రా మికవేత్తలుగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహి స్తోందని తెలిపారు. వడ్డీలేని రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచ డంతో పాటు మహిళా సంఘాలు తీసుకున్న రుణాలపై వడ్డీని ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తోందని, ములుగు జిల్లాలో ఇప్పటివరకు సుమారు రూ.13 కోట్ల వడ్డీ మొత్తాన్ని మహిళలకు తిరిగి చెల్లించినట్లు వెల్లడించారు. ప్రజల కోసం పోరాడి వనదేవతలుగా కొలువు దీరిన సమ్మక్క–సారలమ్మ మహిళలందరికీ గొప్ప స్ఫూర్తి అని పేర్కొన్నారు. మహిళలు మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. బిట్స్ పిలానీ సహకారంతో అందించే శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి మండలం నుంచి వ్యాపారం పట్ల ఆసక్తి, వినూత్న ఆలోచనలు కలిగిన మహిళలను గుర్తించి శిక్షణకు ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. ములు గు జిల్లాలోని అపారమైన ప్రకృతి, పర్యాటక సంపదను మహిళల ఆర్థికాభివృద్ధికి అనుసం ధానం చేయాలని సూచించారు. మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ, రామప్ప దేవాలయం, లక్నవరం సరస్సు, బొగత జలపాతం, గోదావరి తీరం, దట్టమైన అడవులతో ములుగు జిల్లా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో క్యాంటీన్లు, మొబైల్ టిఫిన్ కేంద్రాలు, స్థానిక ఆహార ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానికంగా లభించే ఇప్పపువ్వు, అరటి, మిరప తదితర ఉత్పత్తులకు విలువ జోడించి ప్యాకేజింగ్, మార్కెటింగ్ చేయడం ద్వారా మహిళలకు స్థిరమైన ఆదా యం సమకూరుతుందని తెలిపారు. ములుగు జిల్లా భవిష్యత్తులో ప్రధాన పర్యాటక, విద్యా, వైద్య కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి పేర్కొన్నారు. నూతన కలెక్టరేట్, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, సమ్మక్క–సారక్క కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా సమీకృత గురుకుల విద్యాలయం వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలతో జిల్లాలో వ్యాపార అవకాశాలు మరింత విస్తరిస్తాయని తెలిపారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సుమారు రూ.1.50 కోట్లతో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా వ్యాపారవేత్తలుగా, మరికొందరికి ఉపాధి కల్పించే శక్తిగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, డీఆర్డీఓ రవీందర్, బిట్స్ పిలానీ ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్ కృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థరెడ్డి, ములుగు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.అనూష, డీపీఎంలు, ఏపీఎంలు, సీఏలు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ఎస్పై రవిప్రకాష్**

**ప్రజానావ ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో :** సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడంలో ప్రజల అప్రమత్తతే అత్యంత కీలకమని సైబర్ క్రైమ్ ఎస్పై రవిప్రకాష్ పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షా కా తిరంగా' కార్యక్రమంలో భాగంగా, జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాల మేరకు గురువారం వనపర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో వాకర్స్, రిటైర్డ్ ఉద్యోగులకు సైబర్ భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పై రవిప్రకాష్ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం సైబర్ భద్రతలో భాగస్వామి కావాలని, తల్లిదండ్రులు పిల్లల డిజిటల్ వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తెలియని లింకులు, ఫోన్ కాల్స్, క్యూఆర్ కోడ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఓటీపీ, పిన్ నంబర్లను ఎవరికీ చెప్పకూడదని హెచ్చరించారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ ఎస్పై హరిప్రసాద్, వాకర్స్ క్లబ్ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

# అకడమిక్ ప్యానల్ తనిఖీలకే పరిమితం కాకూడదు

- ఉపాధ్యాయులకు సహకారం అందిస్తూ విద్యా ప్రమాణాల మెరుగుదలకు దోహదపడాలి
- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజానావ, పెద్దపల్లి:** అకడమిక్ ప్యానల్ పాఠశా లల సందర్శనలను కేవలం తనిఖీలకే పరిమితం చేయకుండా ఉపాధ్యాయులకు అవసరమైన అకడమిక్ సహకారం అందిస్తూ విద్యా ప్రమాణాల మెరుగుదలకు దోహదపడేలా నిర్వహించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పెద్దపల్లి జిల్లాలో అమలు చేస్తున్న అకడమిక్ ప్యానల్ విధానంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రతి పాఠశాల సందర్శనలో తరగతి గది పరిశీలన, విద్యార్థుల స్పాట్ అసెస్మెంట్ నిర్వహించి, అభ్యసన స్థాయిని అంచనా వేయాలని తెలిపారు. గుర్తించిన లోపాలను పరిష్కరిం చేందుకు అవసరమైన జోక్యాలను చేపట్టడంతో పాటు విద్యార్థుల అభ్యసన డేటా ఆధారంగా బోధనా ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ఉపాధ్యాయుల బోధనలోని మంచి అంశాలను గుర్తించి అభినందించడంతో పాటు మెరుగుదలకు అవసరమైన స్పష్టమైన, ఆచరణ సాధ్యమైన సూచనలు ఇవ్వాలని అన్నారు. అకడమిక్ ప్యానల్ సందర్శనలతో ఉపాధ్యాయుల్లో భయం కాకుండా బోధనా సామర్థ్యా లను పెంపొందించే సహకారం అందించాలన్నారు. తరగతి గదిలో విద్యార్థుల చురుకైన భాగస్వామ్యం, ప్రశ్నించడం, చర్చించడం, స్వతంత్రంగా నేర్చుకునేలా బోధనా పద్ధతులను మార్చాలని సూచించారు. డిజిటల్ టూల్స్, బోధన–అభ్యసన సామగ్రిని సమర్థంగా వినియోగించాలని తెలిపారు. గుర్తించిన లోపాల పరిష్కారానికి కాంప్లెక్స్ సమావేశాలు, సబ్జెక్ట్ ఫోరమ్‌లను బలోపేతం చేసి, ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, అకడమిక్ బృందాలు నిరంతర ఫాలోఅప్ నిర్వహించాలని ఆదేశించారు. క్వాలిటీ కోఆర్డినేటర్లు పాఠశాలల పరిశీలనలను క్రమబద్ధంగా నమోదు చేసి, డేటా ఆధారంగా పాఠశాల, మండల స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అకడమిక్ మానిటరింగ్ లక్ష్యం తప్పులను గుర్తించడం కాదని, ఉపాధ్యాయులకు సహకరించడం, బోధనా పద్ధతులను బలోపేతం చేయడం, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, క్వాలిటీ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.





# యూరియా కొరతపై రైతుల ఆగ్రహం

**సొసైటీకి తాళం వేసి బైఠాయింపు**

**ప్రజానావ, గంభీరావుపేట:** యూరియా కొరత నిరసిస్తూ గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామ రైతులు గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగ్రహించిన రైతులు సొసైటీ కి తాళం వేసి సొసైటీ ఎదుట బైఠాయించారు. యూరియా బుకింగ్ చేసుకునేందుకై రైతులు ఫోన్లు పట్టుకొని సొసైటీ వద్దకు వచ్చి తీరా బుక్ చేసే సమయానికి యాప్ పనిచేయకపోవడం పలువురు రైతులు ఆగ్రహానికి గురయ్యారు. యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవడం రైతులకు ఇబ్బందిగా మారుతుంది. బుక్ చేసుకునే సమయానికి సాంకేతిక లోపంతో యాప్ పని చేయకపోవడం తలనొప్పిగా మారుతుం దని రైతులు వాపోతున్నారు. సహకార సంఘాల్లో తగినన్ని యూరియా నిలువలు లేకపోవడం, యాప్ బుకింగ్ పని చేయకపోవడం యూరియా కై రైతులు గంటల తరబడి నిరీక్షించి వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవైపు పొలం పనులు చూసుకోవడం మరోవైపు యూరియా కోసం నిరీక్షిం చడం ఇబ్బందిగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు సరిపడు యూరియాను అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసిల్దార్ మారుతి రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్, వ్యవసాయ అధికారి సలావుద్దీన్ ఆందోళన నిర్వహిస్తున్న రైతుల వద్దకు వెళ్లి రైతులను శాంతింప చేశారు. అరగంటలోపు యాప్ యథావిధిగా పనిచే యడంతో రైతులకు యూరియా అందజేశారు. సొసైటీ నందు యూరియా అందుబాటులో ఉండి సాంకేతిక లోపంతో యాప్ పనిచేయలేదని సీఈవో రాజయ్య తెలిపారు. యాప్ పనిచేయడం తో రైతులకు యూరియా బస్తాలు అందజేసినట్లు పేర్కొన్నారు.



# గిరిజనాభివృద్ధి ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యం

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**ప్రజానావ ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో :** ఇందిరమ్మ రాజ్యంతోనే గిరిజనుల సమగ్ర అభివృద్ధి సాధ్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం గోపాల్‌పేట మండలం కర్ణమా యకుంట తండాలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తండాల అభివృద్ధికి, గిరిజన సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నూతన భవనం ద్వారా తండా ప్రజలకు పాలన మరింత చేరువవుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రానున్న రోజుల్లో కర్ణమాయకుంట తండాలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్ దరఖాస్తులు పకడ్బందీగా స్వీకరించాలి

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ప్రజానావ, సిరిసిల్ల:** జిల్లాలో చేయూత పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు, పైలేరియా, డయాలసిస్ బాధితులకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 31లోగా స్వీకరించాలని సూచించారు. అర్హులైన వారు ఆధార్, వయసు ధ్రువీకరణ, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ, బ్యాంక్ పాస్‌బుక్ తదితర పత్రాలను జత చేయాలని తెలిపారు. దివ్యాంగులు, తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా బాధితుల కోసం ప్రత్యేక సదరం శిబిరాలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలను వేగంగా జారీ చేయాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో దరఖాస్తు కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించి, ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం తదితరులు పాల్గొన్నారు.




# సిరిసిల్ల నుంచి సర్ధాపూర్ గోదాంలోకి ఈవీఎంల తరలింపు

**ప్రజానావ, సిరిసిల్ల :** 2018 వేములవాడ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన కోర్టు కేసు కారణంగా ఇంతకాలం సిరిసిల్ల పట్టణంలోని ప్రభు త్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేకంగా భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంల)ను గురువారం సర్ధాపూర్‌లోని ఈవీఎం గోదాంలోకి తరలించారు. కోర్టు కేసు ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతులు వచ్చిన అనంతరం, ఎన్నికల నిబంధనలు, భద్రతా ప్రమాణా లకు అనుగుణంగా ఈవీఎంల తరలింపు ప్రక్రియను చేపట్టారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఈ ప్రక్రియను పరిశీలించి, ఈవీఎంలు భద్రపరిచే విధా నంపై అధికారులకు పలు సూచనలు చేశారు. 2018 వేములవాడ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన కోర్టు కేసు కారణంగా ఇంతకాలం సంబంధిత ఈవీఎంలను ప్రత్యేకంగా సిరిసిల్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భద్రపరిచామని, రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతుల మేరకు ప్రస్తుతం వాటిని సర్ధాపూర్‌లోని గోదాంలో భద్రపరిచేందుకు తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, వేములవాడ ఆర్డీఓ కె.ఎస్ బి. కుమారి, తహశీల్దార్లు మహేష్ కుమార్, జయంత్, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



# పార్లమెంట్‌ను అపవిత్రం చేశారు!

సమస్యలను చర్చించకుండా.. వ్యక్తిగత ఎజెండాలతో భ్రష్టు పట్టించారు. ఇలాంటి నేతలు ప్రజల సమస్యలు పరిష్కరిస్తా రని, వారి ఆశలను పరిశీలిస్తారని అనుకోవడం బుద్ధితక్కువ తప్ప మరోటి కాదు. చట్టసభల్లో సమస్యలు చర్చించాలి. సమస్యలకు సమాధానాలు రాబట్టాలి. చట్టాలను చేయాలి. కానీ ఇవేవీ జరగకుండా విపక్షాలు అడ్డుకుంటే..అధికార పక్షం చోద్యం చూసింది. దొందూ దొందే అన్నచం దంగా సమావేశాలు సాగకుండా 19 రోజుల పాటు నానా రభస సృష్టించారు. చివరి రోజు గురువారం కూడా సభలు సజావుగా సాగక పోవడంతో ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేశారు. మొత్తంగా ఈ 19 రోజులు ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదాపడ్డాయి.

తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా.. పార్లమెంటు సమావేశాలు మట్టి కరవడానికి అందరూ బాధ్యులే. 19 రోజుల పాటు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరించి ఎన్నుకున్న ప్రజలను అవామానానికి గురి చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో వీరిని ఎన్నుకుని పంపితే చట్టసభలను చట్టుబండలు చేస్తున్నారు. సమస్యలను చర్చించకుండా.. వ్యక్తిగత ఎజెండాలతో భ్రష్టు పట్టించారు. ఇలాంటి నేతలు ప్రజల సమస్యలు పరిష్కరిస్తారని, వారి ఆశలను పరిశీలిస్తారని అనుకోవడం బుద్ధితక్కువ తప్ప మరోటి కాదు. చట్టసభల్లో సమస్యలు చర్చించాలి. సమస్యలకు సమాధానాలు రాబట్టాలి. చట్టాలను చేయాలి. కానీ ఇవేవీ జరగకుండా విపక్షాలు అడ్డుకుంటే..అధికార పక్షం చోద్యం చూసింది. దొందూ దొందే అన్నచందంగా సమావేశాలు సాగకుండా 19 రోజుల పాటు నానా రభస సృష్టించారు. చివరి రోజు గురువారం కూడా సభలు సజావుగా సాగక పోవడంతో ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేశారు. మొత్తంగా ఈ 19 రోజులు ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదాపడ్డాయి. దీంతో పార్లమెంటు సమావేశాలు మొదలైన జులై 20 నుంచి ఇప్పటిదాకా 19 రోజులు సభా కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి. అధికార, ప్రతిపక్షాలు పట్టు వీడక పోవడంతో ఆఖరి రోజూ సజావుగా సాగలేదు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు సిద్ధమని బుధవారం ంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. చర్చకు ప్రతిపక్షం అంగీకరిస్తే పార్లమెంటు సమావేశాలను పొడిగించడానికీ సిద్ధమని కేంద్రం తెలిపింది. అయితే ఆయన లెక్చర్ వినడానికి సిద్ధంగా లేమని ప్రతిపక్షం ఆ సవాల్‌ను తోసిపుచ్చింది. బుధవారం ఉదయం 11గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. చర్చను ప్రారంభిద్దామని మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపాదించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సభ నిరవధికంగా వాయిదా పడింది. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంటే ప్రతిపక్షం పారిపోవడం తొలిసారిగా చూస్తున్నా' అని పార్లమెంటరీ వ్యవహారా మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. నిజయోకవర్గ సమస్యలను ఎలాగూ పట్టించుకోవడం లేదు. అలాగే దేశ సమస్యలపైనా బాధ్యత లేదు. ప్రతిపక్షం బలంగా గళం వినిపిస్తేనే ప్రభుత్వాలు తలవంచుతాయి. ఆందోళన చేయడం కూడా ఓ రకమైన నిరసన అని చెప్పుకుని తప్పించుకోవడం మినహా విపక్షం చేసిందేవూ లేదు. పార్లమెంట్ లోపాలా, బయటా ధర్నాలు చేయడం మినహా సాధించిందేవూ లేదు. దీనికోసం ప్రజలు ఎంపిలను ఎన్నుకోలేదు. విద్యార్థుల ఆందోళనలపై ప్రభుత్వం చర్చకు సిద్ధమని చెప్పడం.. అమిత్ షా ప్రతిష్ఠ అనే గాలి బుడగ పేలిపోయాక దానిలో గాలిని నింపడానికి చేసిన చివరి ప్రయత్నంగా రాహుల్ అభివర్ణించారు. అసలు తమపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపడానికి ఎవరు ఆదేశించారో తెలుసుకోవాలని యువత కోరుకుంటున్నారని రాహుల్ పట్టుపడుతూ వచ్చారు. అమిత్ షా ఉపన్యాసం వినడానికి సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు. విద్యార్థుల ఆందోళనలు, వాటికి సంబంధించిన అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నానని అమిత్ షా తెలిపారు. ప్రతిపక్షాలు చర్చను కోరుతూ లోక్‌సభ స్పీకరుకు లేఖ ఇవ్వాలని, వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. మొత్తం చర్చలో తాను పాల్గొంటానని తేల్చి చెప్పారు. చర్చ నుంచి తాను పారిపోతున్నా నన్న ప్రతిపక్షాల ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన స్పీకర్‌కు లేఖ రాశారు. ప్రతిపక్షాలతో సంప్రదించి విద్యార్థుల ఆందోళనలపై చర్చ చేపట్టాలని కోరారు. కానీ విపక్షం చర్చకు సిద్ధంగా లేదని తేలిపోయింది. వలం బలప్రదర్శన వేదికగా వర్షాకాల సమావేశాలు నిలిచాయి. విపక్షాలు బలంగా ఉన్నాయని చాటి చెప్పడానికి ప్రయత్నించారు. ప్రధానంగా విదేశీ విరాళాల సవరణ బిల్లును అడ్డుకోవడం కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. ప్రజలు ఇప్పుడు ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగదదన్న విపక్షం ఎజెండా విజయం సాధించింది. పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేసాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా ఈ సమావేశాల్లో మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును ప్రజలు గమనించారు. ఎవరేంటో తెలుసుకుంటున్నారు. వీరితీరుపైనా జెన్‌జీలు దృష్టి సారించాలి. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న నాయకులను కనిపెట్టాలి. లేకుంటే పార్లమెంట్ సమావేశాలకు అర్థం లేకుండా పోతుంది. ఇలా 19 రోజులు సభలను వృథా చేసినందుకు నేతల జీతభత్యాలను కట్ చేయాలి. వారికి తగిన ఫైన్ వేయాలి. అప్పుడే నేతల్లో జవాబుదారీతనం వస్తుంది.

పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారిం చడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేసాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా ఈ సమావేశాల్లో మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయన డంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును ప్రజలు గమనించారు. ఎవరేంటో తెలుసుకుం టున్నారు. వీరితీరుపైనా జెన్‌జీలు దృష్టి సారించాలి.

EDITORIAL



## పెట్రో డీలర్ల మార్జిన్ పెంచాలి

### కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పూరీకి వినతిపత్రం
### అందజేసిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**ప్రజానావ, ఖమ్మం:** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, సహజవాయువు, వంటగ్యాస్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి మార్జిన్ (కమీషన్)ను పెంచాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎంపీ రవిచంద్ర గురువారం పార్లమెంట్ ఆవరణలో పెట్రోలియం, సహజవాయువు శాఖల మంత్రి హర్దీప్‌సింగ్ పూరీని కలిసి వినతిపత్రం సమర్పించి డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. యునైటెడ్ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్‌కు చెందిన తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, హర్యానా, పశ్చిమ బెంగాల్, బీహార్ తదితర రాష్ట్రాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీలర్ల మార్జిన్ పెంచాలని తనతో పాటు స్థాయీ సంఘం చైర్మన్ సునీల్ దత్తాత్రేయ తట్కరేను ఇటీవల కలిసి విజ్ఞప్తి చేసిన విషయాన్ని ఎంపీ రవిచంద్ర కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, ఇతర పెట్రోలియం ఉత్పత్తుల డీలర్లకు సుమారు ఎనిమిదేళ్ల క్రితం ఖరారు చేసిన మార్జిన్ ఇప్పటికీ కొనసాగుతోందని, ఈ కాలంలో నిర్వహణ వ్యయాలు, ఇతర ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్జిన్‌ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంచాల్సిన అవసరం ఉందని ఎంపీ వివరించారు. డీలర్ల సమస్యలను పరిష్కరించి మార్జిన్ పెంపుపై సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరగా కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పూరీ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.

## పోలీస్ సిబ్బంది శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరం

- ఇండోర్ షటిల్ కోర్టు ప్రారంభం
- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**ప్రజానావ, నాగర్‌కర్నూల్:** విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడిని ఎదుర్కొనే పోలీసు అధికారులు, సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు విధుల్లో మరింత ఉత్సాహంగా, సమర్థవంతంగా పనిచేసేందుకు క్రీడలను తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసు అధికారులు, సిబ్బంది కోసం సుమారు రూ.8 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండోర్ షటిల్ కోర్టును జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి.పాటిల్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో సేవలందించడం వంటి బాధ్యతలను నిర్వర్తించే క్రమంలో తీవ్ర పని ఒత్తిడిని ఎదుర్కొంటారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో క్రీడలు వారికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని అన్నారు. ప్రతి ఉద్యోగికీ క్రీడలు అవసరమే అయినప్పటికీ పోలీసు సిబ్బందికి వాటి అవసరం మరింత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వం, ఏకాగ్రత, చురుకుదనం పెరగడంతో పాటు ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంటే విధి నిర్వహణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించగలరని అన్నారు. పోలీసు సిబ్బందికి మెరుగైన క్రీడా వసతులు కల్పించేందుకు రూ.8 లక్షల నిధులతో ఇండోర్ షటిల్ కోర్టును ఏర్పాటు చేయడంపై జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయమన్నారు. ఈ సదుపాయాన్ని పోలీసు అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. శారీరక, మానసిక దృఢత్వం కోసం ప్రతి ఒక్కరూ క్రీడల్లో తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి.పాటిల్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగుల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను దృష్టిలో ఉంచుకుని ఇండోర్ షటిల్ కోర్టు ఏర్పాటుకు సహకరించిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, రెవెన్యూ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం ప్రజాసేవలో ఉంటారని, అనేక సందర్భాల్లో రాత్రింబవళ్లు విధులు నిర్వహించాల్సి వస్తుందని చెప్పారు. ఇలాంటి పని ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక ఫిట్‌నెస్‌ను పెంపొందించుకోవడంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తూ శాఖపరంగా అందుబాటులో ఉన్న క్రీడా సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన శరీరం, ప్రశాంతమైన మనసు ఉన్నప్పుడే విధులను మరింత సమర్థవంతంగా నిర్వర్తించగలమని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీతో పాటు ఇతర అధికారులు నూతన ఇండోర్ షటిల్ కోర్టులో బ్యాడ్మింటన్ ఆడి ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి.పాటిల్, అదనపు కలెక్టర్, అదనపు ఎస్పీ నోముల వెంకటేశ్వర్లు తదితర అధికారులు స్వయంగా క్రీడల్లో పాల్గొనడం ద్వారా పోలీసు సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, వెంకటేశ్వర్, ఆర్డీవో అర్చన, డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ తబితా రాణి, స్థానిక సీఐ అశోక్‌రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జున ప్రైవేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూపారెడ్డి దారుణ హత్య

- హత్యపై పలు అనుమానాలు..
- ఎస్పీ శరత్‌చంద్ర ఆదేశాలతో నాలుగు బృందాలుగా దర్యాప్తు
- కేసును పర్యవేక్షిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు



**ప్రజానావ, దేవరకొండ:** కొండమల్లేపల్లి పట్టణంలోని నాగార్జున ప్రైవేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, డైరెక్టర్ కల్లు రూపారెడ్డి దారుణ హత్యకు గురైన ఘటన బుధవారం వెలుగులోకి రావడంతో పట్టణంలో భయాందోళనలు నెలకొన్నాయి. పట్టణంలోని జేబీ కాలనీలో ఈ ఘటన చోటుచేసుకోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఉన్నత కుటుంబాలకు చెందిన పలువురు నివసించే ఈ ప్రాంతాన్ని సురక్షిత కాలనీగా భావిస్తుండగా, అక్కడే హత్య జరగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. మృతురాలు రూపారెడ్డి కాలనీలో అందరితో కలివిడిగా ఉంటూ మంచి పేరు సంపాదించుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను అత్యంత దారుణంగా, విచక్షణారహితంగా కత్తితో నరికి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. హత్యకు గల కారణాలపై పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్లు రూపారెడ్డి కొండమల్లేపల్లి పట్టణంలోని జేబీ కాలనీలో నివాసం ఉంటున్నారు. పక్కనే ఉన్న నాగార్జున ప్రైవేట్ పాఠశాలలో గత కొన్ని సంవత్సరాలుగా డైరెక్టర్‌గా, ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం సాయంత్రం పాఠశాల ముగిసిన అనంతరం రోజువారీగా పక్కనే ఉన్న తన ఇంటికి వెళ్లారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఆమె భర్త కల్లు రాజేందర్‌రెడ్డి మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో ఫోన్ చేయగా ఫోన్ స్విచ్‌ఆఫ్ రావడంతో ఆందోళనకు గురయ్యారు. బుధవారం ఉదయం మరోసారి ఫోన్ చేసినా స్విచ్‌ఆఫ్ రావడంతో ఇంటిపై అద్దెకు ఉంటున్న వారికి సమాచారం అందించారు. వారు వెళ్లి చూడగా రూపారెడ్డి మృతి చెంది ఉండటాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, కొండమల్లేపల్లి సర్కిల్ సీఐ నవీన్, ఎస్ఐ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలిని విచక్షణారహితంగా హత్య చేసిన ఆనవాళ్లు కనిపించడంతో నల్లగొండ నుంచి డాగ్ స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్ నిపుణులను రప్పించి కీలక ఆధారాలను సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు హత్య కేసును ఛేదించేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత మరిన్ని కీలక ఆధారాలు లభించే అవకాశం ఉందన్నారు. మృతురాలి కుమారుడు కల్లు అవినయ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.



## ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు ఘన స్వాగతం

### అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కమిషన్ చైర్మన్

**ప్రజానావ, కొండమల్లేపల్లి/దేవరకొండ:** కొండమల్లేపల్లి పట్టణానికి వచ్చిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యుడు నేనావత్ రాంబాబు నాయక్‌కు కొండమల్లేపల్లి చౌరస్తాలో ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. రామావత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో నాయకులు, సంఘాల ప్రతినిధులు వారికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యుడు నేనావత్ రాంబాబు నాయక్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేనావత్ కృష్ణ, నేనావత్ మధు, ఆదిరాల రమేష్, మూడవత్ జగ్రూ నాయక్, శంకర్ నాయక్, సైదులు, కోర్ర కోటేష్, బాలు, బాలకృష్ణ, అందుగుల నాగరాజు, అందుగుల కేశవులు తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ రెవెన్యూ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా పారదర్శకంగా సేవలందించాలి
- పెనుబల్లి తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ సమీక్ష

**ప్రజానావ, పెనుబల్లి:** పెనుబల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ గురువారం సందర్శించి రెవెన్యూ అంశాలపై అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ స్లాట్లు, భూభారతి దరఖాస్తులు, రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీలు, సాదా బైనామా దరఖాస్తులు, ప్రజా ఫిర్యాదులు, మీ–సేవ ద్వారా జారీ చేసే వివిధ ధ్రువపత్రాలపై ఆయన అధికారులతో వివరంగా చర్చించారు. ఆయా దరఖాస్తుల ప్రస్తుత పరిస్థితి, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనవసరంగా పెండింగ్‌లో ఉంచవద్దని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. భూములకు సంబంధించిన వివాదాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, భూహక్కులు, రిజిస్ట్రేషన్, రెవెన్యూ సదస్సుల అర్జీల పరిష్కారంలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి, ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు, పెండింగ్ కేసుల పర్యవేక్షణ తదితర అంశాలను కూడా సబ్ కలెక్టర్ సమీక్షించారు. రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనాభా లెక్కలతోనే సరైన అభివృద్ధి

- జనగణన 2027 సన్నాహకాల్లో హ్యాండ్‌బుక్ తయారీపై సమగ్ర వివరాలు సేకరించాలి
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




**ప్రజానావ, మెదక్:** జనగణన 2027 సన్నాహకాల్లో భాగంగా రూపొందిస్తున్న జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ అత్యంత ప్రామాణికమైనదని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులతో జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ తయారీపై గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధమైన భవిష్యత్తు అభివృద్ధికి జనాభా లెక్కలు కీలకంగా దోహదపడతాయని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లోని ప్రతి రంగానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి, ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. జనగణన 2027 సన్నాహకాల్లో మున్సిపల్, విద్య, వైద్య ఆరోగ్య, హౌసింగ్, ఆర్అండ్‌బీ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల వారీగా జనాభా వివరాలను నమోదు చేయడంతో పాటు మౌలిక వసతులు, విద్య, వైద్యం, పౌర సౌకర్యాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. డిజిటల్ యాప్‌లు, వెబ్ పోర్టల్స్ ద్వారా ఖచ్చితమైన సమాచారాన్ని క్రోడీకరించాలని, రెవెన్యూ గ్రామాల స్థాయిలో అధికారుల ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. జనాభా లెక్కల సమాచారం భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు ఆధారంగా నిలిచేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ గూగుల్ మీట్ సమావేశంలో డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, ఆర్డీవోలు రమాదేవి, రామకృష్ణ, బవయ్య, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితికి ముందే విద్యుత్ భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలి

- మండపాల వద్ద ప్రమాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలి
- విద్యుత్ శాఖ డీఈఈకి కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్ వినతి




**ప్రజానావ, జహీరాబాద్:** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని వివిధ వార్డుల్లో ఏర్పాటు చేయనున్న గణేష్ మండపాల వద్ద విద్యుత్ భద్రతా ఏర్పాట్లను ఉత్సవాలు ప్రారంభమయ్యేలోపే పూర్తి చేయాలని 27వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్ కోరారు. ఈ మేరకు విద్యుత్ శాఖ డీఈఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గణేష్ మండపాల వద్దకు పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున విద్యుత్ వైర్ల కారణంగా ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ కేబుళ్లు అస్తవ్యస్తంగా, బహిరంగంగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ప్రమాదాలకు తావులేకుండా పాత కేబుళ్లను సురక్షితమైన ఇన్సులేటెడ్ కేబుళ్లతో మార్చడంతో పాటు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. భవాని మందిర్ రోడ్డులోని రాచన్నపేట్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే గణేష్ మండపం వద్ద ప్రతి సంవత్సరం విద్యుత్ వైర్లతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. మండపానికి విద్యుత్ వైర్లు చాలా సమీపంలో ఉన్నందున అధికారులు ఆ ప్రాంతాన్ని ప్రత్యేకంగా పరిశీలించి, ఉత్సవాలు ప్రారంభమయ్యేలోపు అవసరమైన మార్పులు, భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. భక్తులు, మండపాల నిర్వాహకులు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నామ రవికిరణ్, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.



### మోగిన సిరిసిల్ల పట్టణ పద్మశాలి..
## యువజన సంఘం ఎన్నికల నగార

- ఈనెల 23న ఎన్నికల పోలింగ్
- ఎన్నికల నోటిఫికేషన్, షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల అధికారి మామిడాల భూపతి

**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణ పద్మశాలి యువజన సంఘం ఎన్నికల షెడ్యూల్ ను గురువారం ఎన్నికల అధికారి మామిడాల భూపతి, ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ గుండ్లపల్లి పూర్ణచందర్ సంయుక్తంగా ప్రకటించారు. ఈనెల 16 ఆదివారం నుండి 17 మధ్యాహ్నం ఒంటిగంట వరకు నామినేషన్ల స్వీకరణ, అదే రోజు నామినేషన్ల పరిశీలన అనంతరం అభ్యర్థుల జాబితా ప్రకటన ఉంటుందని తెలిపారు. 18 మంగళవారం రోజున నామినేషన్ ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు తుది జాబితా ప్రకటన గుర్తుల కేటాయింపు జరుగుతుందన్నారు. ఈనెల 23 ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్నికlu జరుగుతా యని, అనంతరం ఓట్ల లెక్కింపు ఫలితాల ప్రకటన ఉంటుందని తెలి పారు. అధ్యక్ష స్థానానికి పోటీ చేసే వారికి రూ.12 వేల నామినేషన్ రుసుము, అలాగే ప్రధాన కార్యదర్శికి రూ.10 వేలు, ఉపాధ్యక్షుడు–1, ఉపాధ్యక్షుడగ్–2 స్థానాలకు రూ. 8 వేలు, అలాగే సహాయ కార్యదర్శి, కోశాధికారి పదవుల కు రూ.8 వేల చొప్పున, 39 వార్డు డైరెక్టర్ల స్థానాలకు ఒక్కో స్థానానికి రూ. 3 వేలు చొప్పున నామినేషన్ ఫీజు వసూలు చేయడం జరుగుతుం దని తెలిపారు. ఇటు ఎన్నికల ప్రక్రియ మొత్తం సిరిసిల్లలోని పద్మశాలి కళ్యాణ భవనంలో జరుగుతుందని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు దూడం శంకర్, ప్రధాన కార్యదర్శి మండల సత్యం, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి గెంట్యాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఒగ్గు వేణు, సహాయ కార్యదర్శి వాసం శివశంకర్, సాంస్కృతిక కార్యదర్శి వేముల ప్రకాష్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆడెపు రవీందర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్, గుండ్లపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల పేరుతో సైబర్ మోసం.. ఇద్దరి అరెస్ట్



**ప్రజానావ, వేములవాడ:** పోలీసుల పేరుతో ప్రజలను మోసం చేస్తూ సుమారు రూ.15 లక్షల వరకు సైబర్ మోసాలకు పాల్పడిన అంతర్ జిల్లా నిందితులు ఇద్దరిని చందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. నల్గొండ జిల్లా మోతే మండలానికి చెందిన కిలుకాని సాయిచంద్ (30), సూర్యాపేటకు చెందిన కట్కూరి శరత్‌కుమార్ (31)లను అరెస్ట్ చేసినట్లు వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.నిందితులు గూగుల్, టెలిగ్రామ్ ద్వారా మీసేవ, మనీ ట్రాన్స్‌ఫర్ కేంద్రాల ఫోన్ నంబర్లు సేకరించి, తాము పోలీసు అధికారులమని పరిచయం చేసుకుని అత్యవసర వైద్య ఖర్చుల పేరుతో డబ్బులు పంపాలని బాధితులను నమ్మించేవారని తెలిపారు. ఈ విధంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 28కు పైగా కేసులు ఉన్నట్లు వెల్లడించారు. చందుర్తి మండలానికి చెందిన చిలుక పెంటయ్య అనే వ్యక్తి నుంచి ఇదే తరహాలో రూ.70 వేలు మోసగించిన కేసులో సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.18 వేల నగదు, మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితులను చాకచక్యంగా అరెస్ట్ చేసిన సీఐ రవీందర్, ఎస్ఐ రమేష్, ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది అనిల్, గంగారెడ్డిని డీఎస్పీ అభినందించారు.

## నేరమయ జీవితంతో భవిష్యత్తును పాడుచేసుకోవద్దు

- విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
- ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజానావ, బోధన్:** విద్యార్థులు నేరాలకు పాల్పడి తమ భవిష్యత్తును పాడుచేసుకోవద్దని అదనపు జూనియర్ సివిల్ జడ్జి సాయిశివ సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జడ్జి సాయిశివ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం నిరుపేదలు ఉచితంగా న్యాయ సహాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అందరికీ న్యాయ సేవలు అందించేందుకు పనిచేస్తుందని పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న ఆర్మీ జవానులను ప్రభుత్వం పరివర్తన స్కీం ద్వారా ఆదుకుంటుందని తెలిపారు. విద్యార్థుల శక్తి దేశ భవిష్యత్తు నిర్మాణానికి ఉపయోగపడాలని, దుర్వ్యసనాలకు బానిసలు కావద్దని సూచించారు. బాలికల పట్ల ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపి కేసుల్లో ఇరుక్కోవద్దని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. పోక్సో చట్టం, బాల కార్మిక చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సోషల్ మీడియాను ఇష్టారాజ్యంగా ఉపయోగించకుండా జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పూజిత మాట్లాడుతూ ఎవరిపైనైనా కేసు నమోదైనప్పుడు భయపడాల్సిన అవసరం లేదని, న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. పిల్లలకు ఏ సమస్య ఎదురైనా న్యాయస్థానాన్ని సంప్రదించవచ్చన్నారు. చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడిన సందర్భాల్లో పోక్సో చట్టం ప్రకారం శిక్షలు ఉంటాయని వివరించారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, వాటిని ఎవరూ ప్రోత్సహించరాదని సూచించారు. కార్యక్రమం సందర్భంగా పాఠశాల తరఫున న్యాయమూర్తులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీఆర్ దేశాయ్, రవీందర్, సమయ్య, హెచ్‌ఎం శ్రీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ పెండింగ్ ప్రక్రియను పూర్తి చేయాలి

### కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శికి వినతిపత్రం అందజేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**ప్రజానావ, వరంగల్:** వరంగల్‌లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అనుమతులను త్వరితగతిన మంజూరు చేసి, మిగిలిన అధికారిక ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య కోరారు. ఈ మేరకు గురువారం న్యూఢిల్లీలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించి సమస్యను వివరించారు. వరంగల్, పరిసర ప్రాంతాల్లో సుమారు 12 వేల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సీజీహెచ్ఎస్ వైద్య సేవలపై ఆధారపడి ఉన్నారని ఎంపీ తెలిపారు. వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ అందుబాటులో లేకపోవడంతో వైద్య సేవల కోసం 350 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించాల్సి వస్తోందని, ముఖ్యంగా వృద్ధులు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో ఆర్థిక అనుమతుల కోసం పెండింగ్‌లో ఉందని డా. కడియం కావ్య వివరించారు. వెల్‌నెస్ సెంటర్ భవనానికి సంబంధించిన ఫెయిర్ రెంట్ అసెస్‌మెంట్ ఇప్పటికే పూర్తయిందని, అద్దె ఫైల్‌కు ఆల్ ఇండియా రేడియో సీఈఓ ఆమోదం కూడా లభించిందని తెలిపారు. వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తే వేలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగడంతో పాటు వృద్ధులు, పెన్షనర్లకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.





### యువశక్తితోనే దేశ ప్రగతి..
# విద్యార్థుల్లో దేశభక్తి పెంచాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు
- 10 వేల మంది విద్యార్థులతో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**ప్రజానావ, పెద్దపల్లి :** యువశక్తిని సద్విని యోగం చేసుకుంటే దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. విద్యార్థుల్లో చిన్న నాటి నుంచే దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గురు వారం పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవ రణలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమం లో భాగంగా భారీ జెండా ర్యాలీని ఆయన ప్రారంభించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తిరంగా యాత్రలో దాదాపు 10 వేల మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకుని విద్యార్థులు కదం తొక్కగా, ర్యాలీ దేశభక్తి నినాదాలతో హోరెత్తింది. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా వంటి కార్యక్రమాలు ప్రజల్లో దేశభక్తి, జాతీయ భావాలను మరింతగా పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. జాతీయ జెండా పట్ల గౌరవం, దేశం పట్ల ప్రేమ, సేవా భావాన్ని విద్యార్థుల్లో పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశంగా భారత్ ఉందని, యువత ప్రతిభను సరైన మార్గంలో వినియోగించుకుంటే దేశం అన్ని రంగాల్లో మరింత ముందుకు సాగుతుందని రాంచందర్‌రావు తెలిపారు. భారత్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్రం లోని మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించ డంతో పాటు విద్యా రంగం లోనూ అనేక సంస్కర ణలు చేపట్టినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, యువత భవిష్యత్తుకు మెరుగైన అవకా శాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా మెడికల్ కళాశా లలు, యూనివ ర్సిటీలను విస్తరిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. భారీ సంఖ్యలో విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, గోమాస శ్రీనివాస్, గొట్టిముక్కల సురేష్‌రెడ్డి, నల్ల మనోహర్‌రెడ్డి, చందు పట్ల సునీల్‌రెడ్డి, బల్మూరి వనిత, మీస అర్జున్‌రావు, కందుల సంధ్యారాణి, చల్ల నారాయణరెడ్డి, పెంజర్ల రాకేష్, కావేటి రాజగోపాల్, ఊషణ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన పెన్షన్ విధానానికి సీఎం శ్రీకారం

- రూ.16 వేల కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి పైలాన్ ఆవిష్కరణ
- సీఎం పర్యటన వివరాలు వెల్లడించిన మంత్రి సీతక్క



**ప్రజానావ, ములుగు:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 16న ములుగు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దానసరి అనసూయ సీతక్క ముఖ్యమంత్రి పర్యటన వివరాలను వెల్లడించారు. సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించేందుకు జిల్లా కేంద్రంలోని నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన నిర్మాణ పనులు, పైలాన్ పనులను జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకాన్‌తో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ములుగు నియోజకవర్గంలో పర్యటించనున్నారని తెలిపారు. మధ్యాహ్నం మేడారం చేరుకుని శ్రీ సమ్మక్క–సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం వనదేవతల సన్నిధి నుంచే రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వితంతు మహిళలు, ఒంటరి మహిళలకు సంతృప్త స్థాయిలో పింఛన్లు అందించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుడతారని వెల్లడించారు. ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్న వారికి గతంలో అమలులో ఉన్న నిబంధనల ప్రకారం పరిశీలన నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు. మేడారం కార్యక్రమాల అనంతరం ముఖ్యమంత్రి ములుగు జిల్లా కేంద్రానికి చేరుకుని గట్టమ్మ సమీపంలో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మూడు విడతల్లో సుమారు రూ.16 వేల కోట్లతో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో చేపట్టనున్న రహదారి పనులకు సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరిస్తారని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో రహదారి నిర్మాణ పనులను చేపడుతోందని వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి నూతన కలెక్టరేట్‌కు చేరుకుని తొలుత తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసే సభలో ప్రజలు, అభిమానులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని చెప్పారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు ములుగు నియోజకవర్గ, జిల్లా ప్రజలతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్, సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్ చందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## దీక్షా శిబిరాన్ని సందర్శించని ఎమ్మెల్యే

**ప్రజానావ ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో :** తమ తలపునూరు గ్రామాన్ని నాగర్‌కర్నూల్ జిల్లాలో కలుపుతామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే మేఘారెడ్డి విస్మరించడం శోచనీయమని అల్తాఫ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన పత్రికా ముఖంగా తెలుపుతూ గత మూడేళ్లుగా గ్రామాన్ని నాగర్‌కర్నూల్ జిల్లాలో చేర్చాలని కోరుతూ గ్రామస్తులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 59 రోజులుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం మండలం లోని తలపునూరు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని ప్రారంభించేందుకు వచ్చిన ఎమ్మెల్యే, ప్రోటోకాల్ సైతం పక్కనబెట్టి నాగర్‌కర్నూల్ జిల్లా మీదుగా గ్రామానికి చేరుకున్నారని. భవనాన్ని ప్రారంభించి, ఇచ్చిన హామీ ఏమైపోతుందో అనే భయంతోనే కనీసం దీక్షా శిబిరాన్ని సందర్శించకుండా, గ్రామ సమస్యలను అడిగి తెలుసుకోకుండానే రిబ్బన్ కటింగ్ చేసి అటు నుంచి అటే వెళ్లిపోయారని అల్తాఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



## దేశభక్తి నినాదాలతో మార్మోగిన కామారెడ్డి

### కనుల పండువగా తిరంగా ర్యాలీ

**ప్రజానావ, కామారెడ్డి:** వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకోనున్న సందర్భంగా, 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన ఈ ర్యాలీలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ప్రత్యేకంగా పాల్గొని నాయకత్వం వహించారు. గాంధీగంజ్ నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ జేపీఎన్ రోడ్డు, సుభాష్ రోడ్డు, తిలక్ రోడ్డు, సిరిసిల్ల రోడ్డు, స్టేషన్ రోడ్డు, కమాన్ మీదుగా నిజాంసాగర్ చౌరస్తా వరకు ఉత్సాహభరితంగా సాగింది. చేతుల్లో త్రివర్ణ పతాకాలు పట్టుకుని దేశభక్తి నినాదాలు చేస్తూ ప్రజలు ర్యాలీలో పాల్గొని జాతీయ స్ఫూర్తిని చాటారు. పట్టణంలోని వ్యాపారులు, యువత, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ప్రధాన రహదారులు సందడిగా మారాయి. ర్యాలీ సాగిన మార్గమంతా త్రివర్ణ పతాకాలు రెపరెపలాడుతూ దేశభక్తి వాతావరణం నెలకొంది. దేశభక్తి నినాదాలతో కామారెడ్డి పట్టణం మార్మోగింది. అనంతరం నిజాంసాగర్ చౌరస్తా వద్ద జాతీయ గీతం 'జనగణమన' ఆలాపనతో ర్యాలీ ముగిసింది. దేశ ఐక్యత, సమగ్రతను ప్రతిబింబించేలా సాగిన ఈ కార్యక్రమం కన్నుల పండుగగా నిలిచింది. స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని ప్రజల్లో మరింతగా పెంపొందించడంతో పాటు జాతీయ ఐక్యత, దేశభక్తి భావనలను బలోపేతం చేయడమే లక్ష్యంగా తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దు కుట్రను అడ్డుకోవాలి

- జీఆర్ఎంబీ సమావేశ ఎజెండా నుంచి ప్రాజెక్టుల అనుమతి రద్దు అంశాన్ని వెంటనే తొలగించాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- జీఆర్ఎంబీ సమావేశాన్ని బహిష్కరించాలన్నది బీఆర్ఎస్ డిమాండ్ కాదు
- ప్రాజెక్టుల రద్దు అంశాన్ని ఎజెండా నుంచి తొలగించాలన్నదే తమ డిమాండ్



**ప్రజానావ, సిరిసిల్ల :** ఈ నెల 18న హైదరాబాద్‌లో జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జిఆర్ఎంబి) 18వ సమావేశం ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు సంబంధించిన అంశాన్ని వెంటనే తొలగించాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య నివాసంలో కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణలోని పలు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపా దించడం, ఆ అంశాన్ని జిఆర్ఎంబి సమావేశం ఎజెం డాలో చేర్చడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ఈ సందర్భంగా వినోద్‌కుమార్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు సాధిం చిన చట్టబద్ధమైన అనుమతులను రద్దు చేయాలని కోరడం, ఆ అంశాన్ని జిఆర్ఎంబి ఎజెండాలో చేర్చడం పూర్తిగా సరికాదన్నారు. ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేస్తే తెలంగాణ రైతాంగం, సాగునీటి రంగం, రాష్ట్ర భవిష్యత్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఈ అంశంపై పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయడం లేదని వినోద్ కుమార్ ప్రశ్నించారు. తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు ప్రతిపాదనలు వస్తున్న సమయంలో రాష్ట్ర ఎంపీలు మౌనం వహించడం బాధాకరమన్నారు. తెలంగాణ ఎంపీలందరూ వెంటనే ఢిల్లీకి వెళ్లి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసి, తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దు అంశాన్ని జిఆర్ఎంబి ఎజెండా నుంచి తొలగించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. పార్లమెంట్ వేదికగా కూడా ఈ అంశంపై తెలంగాణ తరఫున గట్టిగా పోరాడాలని కోరారు.

### ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

జిఆర్ఎంబి సమావేశాన్ని బీఆర్ఎస్ పార్టీ బహిష్కరించాలని కోరుతోందంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వినోద్‌కుమార్ విమర్శించారు. జిఆర్ఎంబి సమావేశాన్ని బహిష్కరించాలన్నది బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ కాదని, తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు సంబంధించిన అంశాన్ని మాత్రమే సమావేశం ఎజెండా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశం లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పవర్లూమ్ టెక్స్టైల్స్ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ నర్సింహులు, సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, రాజిరెడ్డి, నర్సింహారెడ్డి, కిషన్, జక్కుల నాగరాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి వాసికి ప్రతిష్ఠాత్మక సాహితీ పురస్కారం



**ప్రజానావ, గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సీనియర్ గ్రూప్–1 అధికారి, తెలంగాణ గవర్నర్ జాయింట్ సెక్రటరీ శశికిరణ్ కొమాండూర్ రచించిన శ్రీమద్రామాయణం పద్య మహాకావ్యానికి 2024 సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం లభించింది. పరిపాలనా బాధ్యతలతో పాటు రెండు దశాబ్దాలుగా సాహిత్య సాధన చేస్తున్న ఆయన వాడుక భాషలో ఛందోబద్ధంగా ఈ మహాకావ్యాన్ని రచించారు. ప్రముఖ ఎమెస్కో సంస్థ ఈ గ్రంథాన్ని ప్రచురించింది. గురువారం లోక్‌భవన్‌లో శశికిరణ్‌ను అధికారులు ఘనంగా సత్కరించారు. ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడంపై కవులు, రచయితలు, సాహితీవేత్తలు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## అనుమానాస్పదంగా మహిళ ఆత్మహత్య



**ప్రజానావ, గంభీరావుపేట:** తొమ్మిది నెలల నిండు గర్భిణీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి గంభీరావుపేట మండలంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని ముస్తఫా నగర్ గ్రామానికి చెందిన బొంతల లావణ్య (27) ఆత్మహత్యకు పాల్పడింది. నిండు గర్భిణీ గా ఉన్న లావణ్యకు ప్రస్తుతం 9 నెలలు నిండినట్లు సమాచారం. మృతురాలికి నాలుగేళ్ల కుమారుడు ఉండగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సింది. నిండు గర్భిణి ఆత్మహత్య పాల్పడిన తీరు గ్రామంలోని పలువురిని కలిసి వేసింది. స్థానిక ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆత్మహత్య కు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.



# పాలస్తీనా ఇళ్లపై సెటిలర్ల ముట్టడి

- ఐదు రాత్రులుగా మూడు ఇళ్లను చుట్టుముట్టిన ఇజ్రాయెలీ సెటిలర్లు
- నీరు, విద్యుత్ నిలిపివేత.. బయటకు రాలేక అవస్థలు
- సెటిలర్లను 'ఉగ్రవాదులు'గా అభివర్ణించిన అమెరికా రాయబారి
- రెండు అక్రమ స్థావరాలు తొలగించిన ఇజ్రాయెల్ సైన్యం

**కుస్రా (వెస్ట్‌బ్యాంక్):** ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లోని కుస్రా పట్టణ శివార్లలో మూడు పాలస్తీనా ఇళ్లను ఇజ్రాయెలీ సెటిలర్లు ఐదు రాత్రులుగా చుట్టుముట్టారు. కుటుంబాలు బయటకు వెళ్లకుండా అడ్డుకోవడంతో పాటు నీరు, విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సైన్యం పలుమార్లు జోక్యం చేసుకున్నా సెటిలర్లు తిరిగి వస్తున్నారని బాధితులు తెలిపారు. ఈ ఘటనపై అమెరికా రాయబారి మైక్ హుకాబీ సెటిలర్లను 'ఉగ్రవాదులు'గా అభివర్ణిస్తూ తీవ్రంగా ఖండించారు. కుటుంబాన్ని భయపెట్టి వేధించేందుకు జరిగిన ఈ చర్య దారుణమని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ సైన్యం, పోలీసులతో అమెరికా రాయబార కార్యాలయం సమన్వయం చేస్తోందన్నారు. ఇజ్రాయెల్ సైన్యం కుస్రాను క్లోజ్డ్ మిలిటరీ జోన్‌గా ప్రకటించి, ముట్టడిని 'చట్టవిరుద్ధం, ఆమోదయోగ్యం కానిది'గా పేర్కొంది. అయినా సెటిలర్లు తిరిగి వచ్చి రహదారిని దిగ్బంధం చేందుకు ప్రయత్నించారని స్థానికులు తెలిపారు. గురువారం సైన్యం కుస్రా, సమీప గ్రామంలోని రెండు అక్రమ స్థావరాలను తొలగించి, ఒక ఇజ్రాయెలీని అదుపులోకి తీసుకుంది.

### పెరుగుతున్న హింస..

వెస్ట్‌బ్యాంక్‌లో సెటిలర్ల దాడులు పెరుగుతున్నాయని ఐక్యరాజ్యసమితి తెలిపింది. 2026లో కుస్రాలోనే అత్యధిక దాడులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు ఇజ్రాయెలీ సెటిలర్లు, సైనికుల చేతుల్లో 87 మంది పాలస్తీనీయులు మరణించారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. పాలస్తీనా అధికారులు 2026లో 1,476 సెటిలర్ దాడులను నమోదు చేశారు. వెస్ట్‌బ్యాంక్‌లో సుమారు 28 లక్షల మంది పాలస్తీనీయులు, 5.60 లక్షలకు పైగా ఇజ్రాయెలీ సెటిలర్లు నివసిస్తున్నారు. దశాబ్దానికి పైగా ఇజ్రాయెల్–పాలస్తీనా శాంతి చర్చలు జరగకపోవడంతో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

# ఏఐ వినియోగంపై మార్గదర్శకాలు అవసరం

- నిఘా, కంటెంట్ నియంత్రణలో పారదర్శకతకు ప్రాధాన్యం
- పిటిషనర్ సూచనలను కేంద్రం పరిశీలించాలి: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత నిఘా, కంటెంట్ నియంత్రణలో నైతికత, పారదర్శకతకు సంబంధించి తప్పనిసరి మార్గదర్శకాలను రూపొందించే అంశంపై పిటిషనర్ చేసిన సూచనలను పరిశీలించాలని కేంద్రంతో పాటు సంబంధిత అధికారులను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ అంశం అత్యంత సాంకేతికమైనదని, విధానపరమైన అంశాలతో ముడిపడి ఉన్నందున తగిన విధానం లేదా నియంత్రణ అవసరమని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం న్యాయవాది నరేంద్ర కుమార్ గోస్వామి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ''మేం ఏం చేయగలం?'' అని ధర్మాసనం పిటిషనర్‌ను ప్రశ్నించింది. తన పిటిషన్‌లోని ఒక ప్రధాన అభ్యర్థనను కొనసాగిస్తున్నట్లు గోస్వామి తెలిపారు. సంక్షేమ పథకాలు, పోలీసింగ్, నిఘా, కంటెంట్ నియంత్రణ వంటి రంగాల్లో కేంద్ర మంత్రిత్వ శాఖలు, సంస్థలు వినియోగిస్తున్న లేదా ప్రతిపాదిస్తున్న అధిక ప్రమాద ఏఐ వ్యవస్థల వివరాలను అఫిడవిట్ రూపంలో వెల్లడించేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'మీ రిట్ పిటిషన్‌ను ప్రతినిధిగా పంపండి. ఇది సమగ్ర పిటిషన్' అని సూచించింది. తాము నిపుణులు కాదని, ఇది అత్యంత సాంకేతికమైన అంశమని, విధాన పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది.

### తప్పనిసరి నిబంధనలు కోరిన పిటిషనర్

ఏఐ నైతికతపై తప్పనిసరి మార్గదర్శకాలు, అల్గారిథమిక్ ప్రభావ అంచనాలు, బయాస్ ఆడిట్‌లు నిర్వహించేలా ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. ఏఐ ఆధారిత నిఘా, కంటెంట్ నియంత్రణలో పారదర్శకత, అధిక ప్రమాద ప్రభుత్వ ఏఐ వ్యవస్థల్లో మానవ పర్యవేక్షణ, డేటా రక్షణకు తగిన భద్రతా చర్యలు ఉండాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాల కేటాయింపులు, ప్రిడిక్టివ్ పోలీసింగ్, ముఖ గుర్తింపు, కంటెంట్ నియంత్రణలో ఇప్పటికే వినియోగిస్తున్న అన్ని ఏఐ వ్యవస్థలపై సమగ్ర అల్గారిథమిక్ ప్రభావ అంచనా, స్వతంత్ర బయాస్ ఆడిట్ నిర్వహించి ఆరు వారాల్లో వాటి ఫలితాలను బహిర్గతం చేయాలని పిటిషన్‌లో కోరారు. ఆయా వ్యవస్థల పూర్తి జాబితాను కూడా వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు. ఏఐ అభివృద్ధి, వినియోగాన్ని నియంత్రించేందుకు సమగ్ర పార్లమెంటరీ చట్టాన్ని తీసుకురావడానికి కేంద్రం చర్యలు చేపట్టాలని కూడా పిటిషనర్ కోరారు. ఈ అంశంపై పిటిషనర్ ఫిబ్రవరిలోనే కేంద్రానికి వినతిపత్రం సమర్పించిన విషయాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. ప్రస్తుత దశలో పిటిషన్‌ను ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయకుండా పరిష్కరించిన సుప్రీంకోర్టు.. పిటిషనర్ సూచనలను అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అవసరమైతే తన వినతిపత్రానికి మరిన్ని సూచనలను జతచేసే స్వేచ్ఛ పిటిషనర్‌కు ఉందని తెలిపింది.

## జంతర్ మంతర్‌లో ఫేషియల్ రికగ్నిషన్‌పై సుప్రీం విచారణ

- ఢిల్లీ పోలీసుల బయోమెట్రిక్ నిఘాపై రాజ్యసభ ఎంపీ పిటిషన్
- ఆందోళనకారులు, జర్నలిస్టుల డేటా అనుమతి లేకుండా సేకరించారన్న ఆరోపణ
- సంబంధిత ఇతర పిటిషన్లతో కలిపి విచారణకు ఆదేశం

జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళన సందర్భంగా ఢిల్లీ పోలీసులు ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ (ఎఫ్ఆర్‌టీ), ఇతర బయోమెట్రిక్ నిఘా వినియోగించారన్న ఆరోపణలపై దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనల ధర్మాసనం.. ఇదే అంశంపై ఉన్న ఇతర పిటిషన్లతో కలిపి విచారించాలని ఆదేశించింది. కేరళకు చెందిన సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు ఏఏ రహీమ్ పిటిషన్ దాఖలు చేశారు. శాంతియుత ప్రజా సమావేశాల్లో విచక్షణారహిత బయోమెట్రిక్ నిఘా రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని, ప్రత్యేక చట్టం వచ్చే వరకు ఇలాంటి చర్యలను నిలిపివేయాలని కోరారు. ఆందోళనకారులు, జర్నలిస్టులు, ప్రజల ఫొటోలు, వీడియోలను సీసీ కెమెరాలు, డ్రోన్లు, మొబైల్ కమాండ్ అండ్ కంట్రోల్ వాహనం ద్వారా సేకరించి నిరంతర నిఘా పెట్టారని పిటిషన్‌లో ఆరోపించారు. బయోమెట్రిక్ వివరాలను జాతీయ నేర రికార్డులతో అనుసంధానించారని పేర్కొన్నారు. ప్రైవేటు సంస్థలు ఈ డేటాను భద్రపరిచాయని, ఎఫ్ఆర్‌టీ వినియోగానికి సంబంధించి ప్రైవసీ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ కూడా నిర్వహించలేదని ఢిల్లీ పోలీసుల ఆర్టీఐ సమాధానం వెల్లడించిందని తెలిపారు.

### డేటా తొలగించే అవకాశం కల్పించాలి

కేఎస్ పుట్టస్వామి తీర్పును ప్రస్తావిస్తూ.. ఈ నిఘా చర్యలు రాజ్యాంగ ప్రమాణాలకు విరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు. నిఘాలో ఉపయోగించిన సాంకేతికతలు, డేటాబేస్‌లు, ప్రైవేటు సంస్థల వివరాలను వెల్లడించాలని, ప్రజలు తమ డేటాను తెలుసుకుని తొలగించుకునేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రైవేటు సంస్థల వద్ద ఉన్న బయోమెట్రిక్ డేటా వినియోగాన్ని నిలిపివేసి, శాశ్వతంగా తొలగించేలా ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

# ఎర్రకోట దాడి వెనక అల్‌ఖైదా

- 2025 నవంబర్ దాడికి ఏక్యూఐఎస్ బాధ్యత అధికారికంగా నిర్ధారణ
- ఐరాస భద్రతామండలి ఉగ్రవాద నిరోధక కమిటీ నివేదికలో వెల్లడి
- బంగ్లాదేశ్‌లో ఉగ్ర కణాల ఏర్పాటుకు అవకాశం?
- దక్షిణాసియాలో కొనసాగుతున్న ఉగ్ర ముప్పుపై ఆందోళన



**జెనీవా:** గతేడాది నవంబర్‌లో న్యూఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన ఉగ్రదాడిని అల్‌ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్‌కాంటినెంట్ (ఏక్యూఐఎస్)కు అధికారికంగా ఆపాదించినట్లు ఐరాస భద్రతా మండలి ఉగ్రవాద నిరోధక ఆంక్షల పర్యవేక్షణ బృందం తాజా నివేదికలో వెల్లడించింది. ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద నెమ్మదిగా వెళ్తున్న కారులో జరిగిన భారీ పేలుడులో సుమారు 15 మంది మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. భద్రతామండలి 1267 ఆంక్షల కమిటీకి సమర్పించిన 38వ నివేదికలో ఏక్యూఐఎస్‌పై వివరాలను పొందుపరిచారు. గతంలో విచ్ఛిన్నమైన గ్రూపుగా ఉన్న ఏక్యూఐఎస్ ఇప్పుడు ప్రాంతీయ ఉగ్ర సంస్థగా రూపాంతరం చెందుతోందని పేర్కొంది. పెద్ద యూనిట్లకు బదులుగా చిన్న, వికేంద్రీకృత కణాల ద్వారా కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆర్థిక, లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేసుకుంటోందని తెలిపింది. బంగ్లాదేశ్‌ను ఉపయోగించుకొని అక్కడ ఉగ్ర కణాలను ఏర్పాటు చేసేందుకు ఏక్యూఐఎస్ ప్రయత్నించే అవకాశం ఉందని సభ్య దేశాలు ఆందోళన వ్యక్తం చేసినట్లు నివేదిక పేర్కొంది.

### రసాయన, జీవ ఆయుధాలపై ఆసక్తి

అల్‌ఖైదా, ఐసిస్(దాయెష్)లు రసాయన, జీవ ఆయుధాల తయారీపై కొన్నేళ్లుగా ఆసక్తి చూపుతున్నాయని ఐరాస తెలిపింది. సాంకేతిక సవాళ్లను పూర్తిగా అధిగమించలేకపోయినప్పటికీ.. ఆయుధాల తయారీకి సంబంధించిన సూచనలు ఆన్‌లైన్ ఉగ్రవా ద వర్గాల్లో విస్తరిస్తున్నాయని పేర్కొంది. ఐసిస్–ఖొరాసన్ గతేడాది కాలంలో రిసిన్ విషపదార్థం తయారీపై సూచనలు ప్రచారం చేసినట్లు తెలిపింది. 2025 చివర్లో విదేశాల్లోని ఐసిస్ కణం ఆదేశాలతో రిసిన్ తయారీకి ప్రయత్నించిన ముగ్గురిని, వారిలో ఓ వైద్యుడిని, భారత అధికారులు అరెస్టు చేసిన విషయాన్ని నివేదిక ప్రస్తావించింది.

### ఆఫ్ఘానిస్థాన్ నుంచి ముప్పు

దక్షిణాసియాలో ఉద్రిక్తతలు అధికంగానే ఉన్నాయని ఐరాస పేర్కొంది. పాకిస్థాన్–ఆఫ్ఘనిస్థాన్ మధ్య సరిహద్దు దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో ఉగ్ర సంస్థలకు కొత్త అవకాశాలు లభించే ప్రమాదం ఉందని తెలిపింది. ఆఫ్ఘనిస్థాన్ నుంచి ఉగ్ర ముప్పులో పెద్దగా మార్పు లేదని, అక్కడ పలు ఉగ్ర సంస్థలు కార్యకలాపాలు కొనసాగించగలగడం పొరుగు దేశాలు, మధ్య ఆసియాకు దీర్ఘకాలిక ముప్పుగా మారిందని పేర్కొంది. ఐసిస్–ఖొరాసన్‌ను అణచివేయడంతో పాటు ఇతర ఉగ్ర సంస్థలను నియంత్రించేందుకు తాలిబన్ ప్రయత్నిస్తున్నప్పటికీ.. ఉగ్ర సమస్యను పూర్తిగా అదుపు చేయలేకపోయిందని నివేదిక తెలిపింది.

### టీటీపీ కొత్త విభాగాలు

2025 డిసెంబర్ 25న తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) కొత్త నిర్మాణాన్ని ప్రకటించినట్లు నివేదిక వెల్లడించింది. బలూచిస్థాన్, మధ్య ప్రాంతానికి ఒక విభాగం.. కశ్మీర్, గిల్గిట్‌కు మరో విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. 'టీటీపీ ఎయిర్‌ఫోర్స్' పేరుతో కొత్త విభాగాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు ఐరాస పేర్కొంది.

## మధ్యప్రాచ్యం వైపు మరో అమెరికా యుద్ధ నౌక

- 'యూఎస్‌ఎస్ జార్జ్ వాషింగ్టన్' కదలిక.. 'అబ్రహం లింకన్' స్థానంలో మోహరింపు
- 240 రోజులకు పైగా సముద్రంలో 'లింకన్'
- పరిస్థితులపై దర్యాప్తు కోరుతున్న డెమొక్రటిక్ ఎంపీలు

**వాషింగ్టన్:** ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో అమెరికా మరో విమాన వాహక యుద్ధనౌకను మధ్యప్రాచ్యం వైపు పంపుతోంది. పసిఫిక్‌లో ఉన్న 'యూఎస్‌ఎస్ జార్జ్ వాషింగ్టన్' వియత్నాంలోని డానాంగ్ నుంచి బయలుదేరి మలక్కా జలసంధిని దాటుతున్నట్లు అమెరికా నౌకాదళం తెలిపింది. క్రూయిజర్, డిస్ట్రాయర్‌తో కలిసి సాగుతున్న ఈ నౌక.. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో ఉన్న 'యూఎస్ ఎస్ అబ్రహం లింకన్' స్థానాన్ని భర్తీ చేయనున్నట్లు సమాచారం. ఇరాన్‌పై యుద్ధంలో భాగంగా మోహరించిన 'లింకన్' 240 రోజులకు పైగా నిరంతరంగా సముద్రంలో ఉంది. యుద్ధ పరిస్థితుల కారణంగా సంప్రదాయ సరఫరా కేంద్రాలకు అంతరాయం ఏర్పడి నౌకలో ఆహారం, పరిశుభ్రతా వస్తువులు, మెయిల్ కొరత ఏర్పడిందని నౌకాదళం అంగీకరించింది. ప్రస్తుతం సిబ్బందికి తాగునీరు, ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో ఉన్నాయని తెలిపింది. దీర్ఘకాలిక మోహరింపుతో సిబ్బంది మానసిక ఆరోగ్యం, మనోస్థైర్యంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పరిస్థితులపై దర్యాప్తు చేయాలని పలువురు డెమొక్రటిక్ ఎంపీలు కోరారు. గతంలో 'యూఎస్ ఎస్ జెరాల్డ్ ఆర్. ఫోర్డ్' కూడా 11 నెలలపాటు మోహరింపులో ఉండటం గమనార్హం.



# సీబీఐ దర్యాప్తు.. పరీక్షల రద్దుపై పట్టు!

- జార్ఖండ్‌లో 20వ రోజుకు చేరిన విద్యార్థుల ఆందోళన
- జేపీఎస్సీ, జేఎస్ఎస్‌సీ పరీక్షలు రద్దు చేయాలని డిమాండ్
- అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాల్సిందే
- డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం విరమించబోమని స్పష్టీకరణ

**రాంచీ:** జార్ఖండ్‌లో నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ఆందోళన 20వ రోజుకు చేరింది. జైపాల్ సింగ్ ముండా స్టేడియం వద్ద వందలాది మంది నిరసనలో పాల్గొన్నారు. జేపీఎస్సీ, జేఎస్ఎస్‌సీ పరీక్షలను రద్దు చేయడంతో పాటు.. సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. బొకారోకు చెందిన జేపీఎస్సీ అభ్యర్థి వివేక్ పండిట్ మాట్లాడుతూ.. తొలిరోజు నుంచే ఆందోళనలో ఉన్నానని, ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించే వరకు కొనసాగిస్తామని తెలిపారు. ఆగస్టు 10న అసెంబ్లీ ముట్టడి సందర్భంగా పోలీసులు లాఠీచార్జి చేసినా తమ పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. జేపీఎస్సీ, జేఎస్ఎస్‌సీ వ్యవహారాల్లో పారదర్శకత లేదని, సమస్యలను పరిష్కరించకుండా విద్యార్థుల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు.

### అవకతవకలతో నష్టపోయాం

లోహర్దగా జిల్లాకు చెందిన రవి కుమార్ మాట్లాడుతూ.. రెండు సంస్థలు నిర్వహించిన పలు పరీక్షల్లో తాను ఉత్తీర్ణత సాధించినప్పటికీ అవకతవకలు, పక్షపాతం కారణంగా నష్టపోయామని అన్నారు. వ్యవస్థలో సంస్కరణలు, సీబీఐ దర్యాప్తు, జేఎస్ఎస్‌సీ–సీజీఎల్ పరీక్ష రద్దు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని చెప్పారు. మంత్రుల కమిటీ తమతో పలుమార్లు చర్చలు జరిపినా సీబీఐ దర్యాప్తు, పరీక్షల రద్దుపై ప్రభుత్వం అంగీకరించలేదని నిరసనకారులు తెలిపారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. మరో విద్యార్థిని నేహా మాట్లాడుతూ.. తమ పోరాటం తమ కోసమే కాకుండా భవిష్యత్ తరాల కోసమని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ఆగస్టు 10న జరిగిన లాఠీచార్జిని ఖండించారు.

# మాల్యా ఆస్తుల వివాదానికి ముగింపు పలకండి

- పదేళ్లుగా సాగుతున్న వ్యవహారాన్ని తేల్చుకోండి
- వివాదం కొనసాగితే ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం: బాంబే హైకోర్టు



**న్యూఢిల్లీ:** పరారీలో ఉన్న పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా, బ్యాంకుల మధ్య ఆస్తుల వివాదానికి ఇక ముగింపు పలకాలని బాంబే హైకోర్టు సూచించింది. దాదాపు పదేళ్లుగా కొనసాగుతున్న ఈ వ్యవహారాన్ని ఇకనైనా ఓ కొలిక్కి తీసుకురావాలని స్పష్టం చేసింది. వివాదాన్ని ఇలాగే కొనసాగించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంది. ఇరుపక్షాలు కలిసి కూర్చొని ఆచరణాత్మక పరిష్కారం దిశగా అడుగులు వేయాలని సూచించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం మాల్యాకు చెందిన ఆస్తులను వినియోగించుకునేం దుకు ప్రత్యేక పీఎంఎల్‌ఏ కోర్టు ఇచ్చిన అనుమతిని సవాల్ చేస్తూ ఆయన 2020లో బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మిలింద్ జాదవ్ విచారణ చేపట్టారు. ఈడీ జప్తు చేసిన ఆస్తుల ప్రస్తుత పరిస్థితి, దర్యాప్తు పురోగతికి సంబంధించిన వివరాల ను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ వ్యవహారాన్ని ఇంకా సాగదీయకుండా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

### రూ.9 వేల కోట్ల రుణం

కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కోసం విజయ్ మాల్యా పలు బ్యాంకుల నుంచి దాదాపు రూ.9,000 కోట్ల రుణం తీసుకున్నారు. ఆ రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో ఆయనపై పలు కేసులు నమోదయ్యాయి. 2016 మార్చిలో ఆయన భారత్ నుంచి విదేశాలకు వెళ్లిపోయారు. అనంతరం 2019లో ఆయన్ను 'పరారైన ఆర్థిక నేరస్థుడి'గా ప్రకటించారు. చట్టపరమైన చర్యల్లో భాగంగా ఆయన ఆస్తులను జప్తు చేసి, రుణాల రికవరీకి బ్యాంకులు చర్యలు చేపట్టాయి. తనను పరారైన ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించడాన్ని, 2018లో తీసుకొచ్చిన పరారైన ఆర్థిక నేరస్థుల (ఎఫ్ఈఓ) చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ మాల్యా హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్లను విచారించా లంటే మాల్యా ముందుగా భారత న్యాయవ్యవస్థ పరిధిలోకి రావాల్సి ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. బ్రిటన్ కోర్టులు విధించిన ఆంక్షల నేపథ్యంలో మాల్యా భారత్‌కు ఎప్పుడు తిరిగి వస్తారో చెప్పలేమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మరోవైపు, విజయ్ మాల్యాను భారత్‌కు అప్పగించే ప్రక్రియకు సంబంధించి బ్రిటన్ ప్రభుత్వంతో కేంద్రం సంప్రదింపులు కొనసాగిస్తోంది.

## హార్వర్డ్‌పై ట్రంప్ సర్కార్ కేసు కొట్టివేత

- ఘటనలు 'విడివిడిగా, అప్పుడప్పుడూ' జరిగినవే: ఫెడరల్ కోర్టు
- బిలియన్ల డాలర్ల పరిశోధన నిధులు రికవరీ చేయాలన్న ప్రభుత్వ యత్నానికి ఎదురుదెబ్బ

**వాషింగ్టన్:** యూదు విద్యార్థులపై వేధింపులను హార్వర్డ్ యూనివర్సిటీ అడ్డుకోలేదంటూ ట్రంప్ ప్రభుత్వం దాఖలు చేసిన కేసును బోస్టన్ ఫెడరల్ కోర్టు కొట్టివేసింది. ఫెడరల్ పౌర హక్కుల చట్టాల ఉల్లంఘన కొనసాగుతోందని నిరూపించడంలో ప్రభుత్వం విఫలమైందని జడ్జి రిచర్డ్ జి. స్టెర్న్స్ పేర్కొన్నారు. కేసులో పేర్కొన్న ఘటనలు ప్రధానంగా 2023–24 విద్యా సంవత్సరానికి చెందినవని, అవి విడివిడిగా జరిగిన ఘటనలేనని తెలిపారు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి తర్వాత హార్వర్డ్‌లో జరిగిన పాలస్తీనా అనుకూల నిరసనల్లో యూదు విద్యార్థులు వేధింపులు, దాడులకు గురయ్యారని ట్రంప్ ప్రభుత్వం ఆరోపించింది. ఈ కేసు ద్వారా 2023 అక్టోబర్ నుంచి హార్వర్డ్‌కు ఇచ్చిన బిలియన్ల డాలర్ల ఫెడరల్ పరిశోధన నిధులను తిరిగి పొందాలని కోరింది. హార్వర్డ్ మాత్రం యూదు, ఇజ్రాయెలీ విద్యార్థుల భద్రతకు కట్టుబడి ఉన్నామని, యూదు వ్యతిరేకతను ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపింది. హార్వర్డ్‌పై ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన పలు చర్యల్లో ఈ కేసు ఒకటి. గతేడాది మరో కేసులో 260 కోట్ల డాలర్లకు పైగా ఫెడరల్ నిధుల కోతలను వెనక్కి తీసుకోవాలని కోర్టు ఆదేశించింది.

## అక్రమాస్తుల ఆరోపణలపై
# సుప్రీంకోర్టుకు రాహుల్

- సీబీఐ, ఈడీ దర్యాప్తు ఆదేశాలపై అలహాబాద్ హైకోర్టు తీర్పును సవాల్ చేసిన కాంగ్రెస్ అగ్రనేత
- 17న విచారణకు వచ్చే అవకాశం..
- హైకోర్టు ఆదేశాలపై ఉత్కంఠ



**న్యూఢిల్లీ:** అక్రమాస్తుల ఆరోపణలపై సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు జరిపి వివరాలను ధ్రువీకరించాలని అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఆగస్టు 17న విచారించే అవకాశం ఉంది. రాహుల్‌గాంధీపై వచ్చిన అక్రమాస్తుల ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు పురోగతిని వివరించేందుకు సంస్థ దాఖలు చేసిన అఫిడవిట్ సరిపోదని అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ అసంతృప్తి వ్యక్తం చేసింది. జూలై 20న జరిగిన విచారణ సందర్భంగా సీబీఐ ఉన్నతాధికారి స్వయంగా తాజా అఫిడవిట్ దాఖలు చేసి దర్యాప్తు పురోగతిని వివరించాలని ఆదేశించింది. దర్యాప్తులో అక్రమాలకు సంబంధించిన ఆధారాలు, పత్రాలు ఈడీకి లభిస్తే.. చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. సీబీఐ సమర్పించిన అఫిడవిట్ గతంలో ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా లేదని, రాహుల్‌గాంధీ ఆస్తులపై పిటిషనర్ చేసిన ఫిర్యాదులో దర్యాప్తు పురోగతిని సమగ్రంగా వివరించలేదని పేర్కొంది.

### బీజేపీ కార్యకర్త పిటిషన్‌తో విచారణ

కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త ఎస్. విఘ్నేశ్ శిశిర్ దాఖలు చేసిన పిటిషన్‌పై అలహాబాద్ హైకోర్టు ఈ విచారణ చేపట్టింది. రాహుల్‌గాంధీపై వచ్చిన అక్రమాస్తుల ఆరోపణలపై సీబీఐ, ఈడీ దర్యాప్తు చేపట్టాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. గతంలో రాహుల్‌గాంధీకి ద్వంద్వ పౌరసత్వం ఉందంటూ కూడా విఘ్నేశ్ శిశిర్ పలు పిటిషన్లు దాఖలు చేశారు. కేసుకు సంబంధించిన పూర్తి రికార్డులను సీల్డ్ కవర్‌లో భద్రపరచాలని హైకోర్టు ఆదేశించింది.ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగస్టు 17న పిటిషన్‌ను విచారించే అవకాశం ఉండటంతో తదుపరి పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

## లడఖ్‌లో నాలుగు గంటల్లో రెండు భూకంపాలు!

- 5.5, 4.3 తీవ్రతతో వరుసగా ప్రకంపనలు
- లేహ్ ప్రాంతంలో 10 కిలోమీటర్ల లోతులో కేంద్రాలు
- భయాందోళనకు గురైన స్థానికులు

**జమ్మూ:** కేంద్రపాలిత ప్రాంతం లడఖ్‌లో గురువారం దాదాపు నాలుగు గంటల వ్యవధిలో రెండు మోస్తరు తీవ్రత కలిగిన భూకంపాలు సంభవించాయి. వరుస ప్రకంపనలతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం లేదు. జాతీయ భూకంప శాస్త్ర కేంద్రం (ఎన్‌సీఎస్) ప్రకారం.. ఉదయం 6.05 గంటలకు 5.5 తీవ్రతతో తొలి భూకంపం సంభవించింది. లేహ్ ప్రాంతంలో భూమికి 10 కిలోమీటర్ల లోతులో దీని కేంద్రం ఉన్నట్లు తెలిపింది. ఉదయం 9.54 గంటలకు 4.3 తీవ్రతతో మరో భూకంపం వచ్చింది. దీని కేంద్రం కూడా లేహ్ ప్రాంతంలోనే, 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు ఎన్‌సీఎస్ వెల్లడించింది. నాలుగు గంటల్లోనే రెండుసార్లు ప్రకంపనలు రావడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. లడఖ్ భూకంప క్రియాశీల ప్రాంతంలో ఉండటంతో వరుస ప్రకంపనలు మరింత ఆందోళన కలిగించాయి.

# ముగ్గురు ఎడమచేతి స్పిన్నర్లతో!



- గాలే టెస్ట్‌లో కుల్దీప్, జడేజా, మానవ్ సుథార్‌తో బరిలోకి దిగనున్న భారత్?
- వైవిధ్యం, వికెట్లు తీయగల సత్తా మా బలం
- గాలే పిచ్‌పై స్పిన్ కీలకం: బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్

**గాలే:** శ్రీలంకతో తొలి టెస్టుకు భారత్ ముగ్గురు ఎడమచేతి స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశముందని బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ సంకేతాలిచ్చాడు. కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, మానవ్ సుథార్ విభిన్న శైలుల్లో బౌలింగ్ చేయగలగడం, 20 వికెట్లు పడగొట్టే సామర్థ్యం కలిగి ఉండటం జట్టుకు పెద్ద బలమని పేర్కొన్నాడు. కుల్దీప్ ఎడమచేతి రిస్ట్ స్పిన్‌తో దూకుడుగా వికెట్లు తీయగలడని, జడేజా అత్యంత కచ్చితత్వంతో బౌలింగ్ చేస్తాడని మోర్కెల్ వివరించాడు. సుథార్ సంప్రదాయ ఎడమచేతి స్పిన్నర్‌లా బంతిని ఎక్కువగా టర్న్ చేయగలడని చెప్పాడు. ముగ్గురి శైలులు వేర్వేరుగా ఉండటమే భారత స్పిన్ విభాగానికి ప్రత్యేక బలమని పేర్కొన్నాడు.

### గిల్‌కు మరో సవాల్

ముగ్గురు స్పిన్నర్లను ఆడించడంపై తమకు పెద్దగా ఆందోళన లేదని మోర్కెల్ తెలిపాడు. మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వారిని ఎలా ఉపయోగిస్తాడన్నదే కీలకమని అన్నాడు. గాలే పిచ్ మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్నర్లకు అనుకూలించే అవకాశముందని, అందుకే మూడు స్పిన్నర్ల వ్యూహం సరైనదేనని అభిప్రాయపడ్డాడు. స్పిన్ విభాగంలో స్పష్టత ఉన్నప్పటికీ పేస్ విభాగంలో మహ్మద్ సిరాజ్‌కు జోడీగా ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్‌లలో ఒకరిని ఎంచుకోవాల్సి ఉంది. ఇద్దరికీ టెస్టు అనుభవం పరిమితమే. స్వదేశంలో కఠిన పరిస్థితుల్లో చాలానే క్రికెట్ ఆడారని మోర్కెల్ చెప్పాడు. గాలేలో వేడి, ఉక్కపోతే ప్రధాన సవాలని పేర్కొన్నాడు.

### బంతి మెత్తబడిన తర్వాతే అసలు పరీక్ష

కూకాబుర్ర బంతి 20–35 ఓవర్ల తర్వాత మెత్తబడుతుందని, ఆ సమయంలో పేసర్లు ఒత్తిడి కొనసాగించేందుకు కొత్త వ్యూహాలు అనుసరించాల్సి ఉంటుందని మోర్కెల్ తెలిపాడు. బౌలర్లు ఎక్కువసేపు తీవ్రతను కొనసాగించడం, క్రీజును తెలివిగా ఉపయోగించడం, షార్ట్‌బాల్స్‌ను సరైన సమయంలో సంధించడం కీలకమని స్పష్టం చేశాడు.



## హసన్ హవా.. ఆసీస్ విలవిల!

- తొలి టెస్టు తొలిరోజే 198 పరుగులకు ఆస్ట్రేలియా ఆలౌట్
- కెరీర్ బెస్ట్ 6/55తో చెలరేగిన హసన్ మహ్మూద్
- తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 96/1

**డార్విన్:** బంగ్లాదేశ్ పేసర్ల ధాటికి ఆస్ట్రేలియా బ్యాటింగ్ కుప్పకూలింది. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా గురువారం ప్రారంభమైన తొలి టెస్టులో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే ఆలౌటైంది. హసన్ మహ్మూద్ కెరీర్‌లోనే అత్యుత్తమ బౌలింగ్‌తో 6/55తో చెలరేగగా.. టాస్కిన్ అహ్మద్ 2/55, ఎబాడత్ హొస్సేన్ 2/39తో రాణించారు. అనంతరం బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 1 వికెట్‌కు 96 పరుగులు చేసి, ఆస్ట్రేలియా ఆధిక్యాన్ని 102 పరుగులకు తగ్గించింది. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఎంచుకుంది. డార్విన్ పిచ్‌పై పచ్చిక ఉండటాన్ని బంగ్లాదేశ్ పేసర్లు సద్వినియోగం చేసుకున్నారు. ఓపెనర్లు జేక్ వెదరాల్డ్ (23), ట్రావిస్ హెడ్ (22)ను హసన్ ఆరో, ఏడో ఓవర్లలో పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత ఎబాడత్ లబుషేన్ (1)ను ఔట్ చేయడంతో ఆసీస్ 52/3కు చేరింది. కెమెరూన్ గ్రీన్ (13) వికెట్‌తో తొలి సెషన్ ముగిసే సమయానికి 74/4గా నిలిచింది.

### స్మిత్ ఒంటరి పోరాటం

స్టీవ్ స్మిత్ (71) ఆసీస్ ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. 7 ఫోర్లు, ఒక సిక్సర్‌తో పోరాడిన అతడిని హసన్ పెవిలియన్‌కు పంపాడు. అలెక్స్ క్యారీ (19)ను ఎబాడత్, బ్యూ వెబ్‌స్టర్ (12)ను టాస్కిన్ ఔట్ చేశారు. కెప్టెన్ పాట్ కమిన్స్ (9), మిచెల్ స్టార్క్ (1)ను హసన్ వరుసగా పెవిలియన్‌కు పంపి.. నాథన్ లయన్ వికెట్‌తో ఆసీస్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

### బంగ్లాదేశ్ దీటైన ఆరంభం

198 పరుగుల లక్ష్యంతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ కూడా ఆరంభంలో ఒక వికెట్ కోల్పోయింది. షాద్మాన్ ఇస్లాం (20)ను స్టార్క్ ఔట్ చేశాడు. అయితే మొమినుల్ హక్ (35), తంజిద్ హసన్ (32) అజేయంగా 60 పరుగుల భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. ఎనిమిది నెలల తర్వాత టెస్టు ఆడుతున్న ఆస్ట్రేలియా ఆటగాళ్లు తుప్పుపట్టినట్లుగా కనిపించారని స్మిత్ అంగీకరించాడు. పిచ్ తడిగా, బంతి స్వింగ్, సీమ్‌కు అనుకూలంగా ఉండటంతో తొలి రోజు బ్యాటింగ్ కష్టంగా మారిందని చెప్పాడు. ఇదిలా ఉండగా, 2003 తర్వాత తొలిసారి ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు ఆడుతున్న బంగ్లాదేశ్‌కు ఈ మ్యాచ్ ప్రత్యేకంగా మారింది.

## కీమర్ చేతిలో ప్రజ్ఞానంద ఓటమి

- సిన్‌క్విఫెల్డ్ కప్‌లో పోరాడి ఓడిన భారత గ్రాండ్‌మాస్టర్
- మూడు రౌండ్లలో 1.5 పాయింట్లు.. సంయుక్తంగా నాలుగో స్థానంలో
- రెండో వరుస విజయంతో అగ్రస్థానంలో వెస్లీ సో



**సెయింట్ లూయిస్:** భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందకు సిన్‌క్విఫెల్డ్ కప్‌లో తొలి ఓటమి ఎదురైంది. జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌తో గురువారం జరిగిన మూడో రౌండ్ పోరులో ప్రజ్ఞానంద పోరాడి ఓడిపోయాడు. గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న ఈ టోర్నీలో ఓటమితో ప్రజ్ఞానంద మూడు రౌండ్ల తర్వాత 1.5 పాయింట్ల వద్ద నిలిచి సంయుక్తంగా నాలుగో స్థానానికి పడిపోయాడు. ఇంకా ఆరు రౌండ్లు మిగిలి ఉన్నాయి. కీమర్‌తో గతంలో మంచి ఫలితాలు సాధించిన ప్రజ్ఞానందకు ఈసారి ఆరంభంలో ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. అయితే కీలక దశలో చేసిన పొరపాటు అతడి అవకాశాలను దెబ్బతీసింది. చివరకు అరుదుగా కనిపించే రీతిలో చెక్‌మేట్‌తో గేమ్‌ను ముగించాల్సి వచ్చింది.
ఫాబియానో కరువానాపై అమెరికాకు చెందిన వెస్లీ సో సంచలన విజయం సాధించాడు. వరుసగా రెండో గెలుపుతో 2.5 పాయింట్లకు చేరుకుని టోర్నీలో ఒంటరి ఆధిక్యంలో నిలిచాడు. లెవోన్ ఆరోనియన్, మాక్సిమ్ వాచియర్–లాగ్రేవ్ 2 పాయింట్లతో అతడి తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ప్రజ్ఞానందతో పాటు కరువానా, కీమర్, అమెరికాకు చెందిన సెవియన్ శామ్యూల్స్ 1.5 పాయింట్లతో సంయుక్తంగా నాలుగో స్థానంలో ఉన్నారు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన జావోఖిర్ సిందరోవ్, నెదర్లాండ్స్ ఆటగాడు అనిష్ గిరి చెరో పాయింట్‌తో తర్వాతి స్థానాల్లో ఉండగా.. జోర్డెన్ వాన్ ఫొరెస్ట్ 0.5 పాయింట్లతో చివర్లో ఉన్నాడు.

### 100కుపైగా ఎత్తుల్లో గిరి ఓటమి

మరో పోరులో సెవియన్ శామ్యూల్స్.. అనిష్ గిరిని ఓడించాడు. ఈ గేమ్ 100కుపైగా ఎత్తుల వరకు సాగింది. వాచియర్–లాగ్రేవ్, సిందరోవ్ డ్రా చేసుకోగా.. ఆరోనియన్, వాన్ ఫొరెస్ట్ మధ్య పోరు కూడా డ్రాగా ముగిసింది. సెయింట్ లూయిస్‌లో జరుగుతున్న 10 మంది పోల్గొనే ఈ తొమ్మిది రౌండ్ల టోర్నీ ప్రైజ్‌మనీ 4.75 లక్షల డాలర్లు.

## నీళ్ల గొడవ.. కోచ్ మృతి

- ఆటగాళ్ల ఘర్షణలో తీవ్రంగా గాయపడి కన్నుమూత
- 17ఏళ్ల క్రికెటర్ అరెస్టు

**కొలంబో:** ఆటగాళ్ల మధ్య జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన శ్రీలంక మాజీ క్రికెట్ కోచ్ సుమిత్ ఫెర్నాండో (62) మృతి చెందారు. నీళ్లు తాగే విషయంలో ఆగస్టు 8న ఇద్దరు ఆటగాళ్ల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన ఫెర్నాండోను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. ఫెర్నాండోపై దాడికి పాల్పడ్డాడనే అనుమానంతో 17 ఏళ్ల పాఠశాల క్రికెటర్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం కొలంబో కోర్టులో హాజరుపర్చగా.. ఆగస్టు 17 వరకు బాలల పరిశీలన కేంద్రం ఆధీనంలో ఉంచాలని ఆదేశించింది. ఫెర్నాండో అంత్యక్రియలు గురువారం నిర్వహించారు.

### మెండిస్‌కు పాఠశాల రోజుల్లో శిక్షణ

కొలంబో సమీపంలోని మొరటువా ప్రాంతంలోని ప్రిన్స్ ఆఫ్ వేల్స్ కాలేజీలో ఫెర్నాండో గతంలో కోచ్‌గా పనిచేశారు. ప్రస్తుత శ్రీలంక వన్డే కెప్టెన్ కుసాల్ మెండిస్ పాఠశాల క్రికెటర్‌గా ఉన్న సమయంలో ఆయన వద్ద శిక్షణ పొందారు. పలువురు ప్రముఖ పాఠశాల స్థాయి క్రికెటర్లకు కూడా ఫెర్నాండో కోచ్‌గా వ్యవహరించారు. అనంతరం ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోని బ్లూమ్‌ఫీల్డ్ క్రికెట్ అండ్ అథ్లెటిక్ క్లబ్‌కు క్యురేటర్‌గా పనిచేశారు.




## రక్షణ సిబ్బందికి బజాజ్ జనరల్ 'ప్రోషీల్డ్'

- మిలిటరీ సిబ్బంది అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక మోటార్ బీమా పథకం

**న్యూఢిల్లీ:** రక్షణ రంగ సిబ్బంది కోసం బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ ప్రత్యేక మోటార్ బీమా ప్యాకేజీ 'ప్రోషీల్డ్'ను గురువారం అందుబాటులోకి తెచ్చింది. దేశ సరిహద్దులు, భద్రత కోసం విధులు నిర్వహించే రక్షణ సిబ్బంది తరచూ బదిలీలు, కార్యాచరణ బాధ్యతలు, కుటుంబాలకు దూరంగా ఉండే పరిస్థితులను ఎదుర్కొంటుంటారని సంస్థ తెలిపింది. వారి ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకుని రక్షణ, సౌకర్యం, ఆర్థిక భరోసా అందించేలా ప్రోషీల్డ్‌ను రూపొందించినట్లు పేర్కొంది. మారుతున్న వాహన రంగం, కనెక్టెడ్ వెహికల్స్ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన తదుపరి తరం మోటార్ బీమా ఉత్పత్తి 'వీపే 2.0'ను కూడా సంస్థ ప్రకటించింది. ఆధునిక వాహనాలు, మారుతున్న రవాణా ప్రమాదాలకు అనుగుణంగా బీమా రక్షణ కల్పించడమే దీని ఉద్దేశమని తెలిపింది.

## అంతర్జాతీయ ట్రావెల్ ఇన్సూరెన్స్‌లోకి గెలాక్సీ హెల్త్

- 'గెలాక్సీ ఫ్లై గ్లోబల్' పేరిట కొత్త బీమా పాలసీ
- విదేశాల్లో వైద్య అత్యవసర పరిస్థితులు, ప్రయాణ అంతరాయాలకు రక్షణ
- దేశం వెలుపలకూ ఆరోగ్య బీమా సేవలను విస్తరిస్తున్న సంస్థ

**న్యూఢిల్లీ:** టీవీఎస్ కుటుంబం, పరిశ్రమ దిగ్గజం వి.జగన్నాథన్ కుటుంబం ప్రమోట్ చేస్తున్న గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ అంతర్జాతీయ ట్రావెల్ ఇన్సూరెన్స్ విభాగంలోకి ప్రవేశించింది. 'గెలాక్సీ ఫ్లై గ్లోబల్ ట్రావెల్ ఇన్సూరెన్స్'ను గురువారం ప్రారంభించింది. దీంతో ఆరోగ్య బీమాకు పరిమితమైన తమ రక్షణ సేవలను అంతర్జాతీయ ప్రయాణాలకూ విస్తరించినట్లు సంస్థ వెల్లడించింది. విదేశాల్లో ఎదురయ్యే వైద్య అత్యవసర పరిస్థితులు, ప్రయాణానికి సంబంధించిన అంతరాయాల నుంచి సమగ్ర రక్షణ కల్పించేలా ఈ పాలసీని రూపొందించినట్లు గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ తెలిపింది. దేశం నుంచి విదేశాలకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ట్రావెల్ ఇన్సూరెన్స్‌కు ఆదరణ కూడా క్రమంగా పెరుగుతోందని పేర్కొంది. విదేశాల్లో వైద్య ఖర్చులు, ప్రయాణ అంతరాయాలు, మారుతున్న అంతర్జాతీయ ప్రయాణ ప్రమాదాల నుంచి ఆర్థిక రక్షణ అవసరాన్ని ప్రయాణికులు గుర్తిస్తున్నారని సంస్థ తెలిపింది.

## అరుదైన మాగ్నెట్ల తయారీకి 20కంపెనీల బిడ్లు

- రూ.7,280 కోట్ల కేంద్ర పథకానికి కోలిండియా, ఎల్అండ్‌టీ సహా సంస్థల పోటీ
- దేశంలో ఏటా 6వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఏర్పాటు లక్ష్యం
- దిగుమతులపై ఆధారపడటం తగ్గించడమే ప్రధాన ఉద్దేశం




**న్యూఢిల్లీ:** దేశంలో సింటర్డ్ నియోడైమియం–ఐరన్–బోరాన్ అరుదైన భూతల లోహాల శాశ్వత మాగ్నెట్ల తయారీని ప్రోత్సహించేందుకు కేంద్రం చేపట్టిన రూ.7,280 కోట్ల పథకానికి 20 కంపెనీలు బిడ్లు దాఖలు చేశాయి. కోలిండియా, లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్అండ్‌టీ), 20 మైక్రాన్స్, అటెరో రీసైక్లింగ్, లోహమ్ మాగ్నెట్స్, నియో పెర్ఫార్మెన్స్ మెటీరియల్స్ తదితర సంస్థలు పోటీలో ఉన్నాయి. గురువారం కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖలో బిడ్డర్ల సమక్షంలో సాంకేతిక బిడ్లను తెరిచారు. ఈ పథకం ద్వారా దేశంలో ఏటా 6వేల మెట్రిక్ టన్నుల సమగ్ర అరుదైన భూతల లోహాల మాగ్నెట్ల తయారీ సామర్థ్యాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. గ్లోబల్ పోటీ బిడ్డింగ్ ద్వారా ఐదుగురు లబ్ధిదారులను ఎంపిక చేసి, ఒక్కొక్కరికి గరిష్ఠంగా 1,200 టన్నుల సామర్థ్యాన్ని కేటాయించనున్నారు. పథకం వ్యవధి ఏడేళ్లు కాగా.. రెండేళ్లు ప్లాంట్ల ఏర్పాటుకు, ఐదేళ్లు ఉత్పత్తుల విక్రయాలపై ప్రోత్సాహకాలకు కేటాయిస్తారు.

### ఈవీలు, రక్షణ రంగాలకు కీలకం

ఈ మాగ్నెట్లు విద్యుత్ వాహనాలు, విండ్ టర్బైన్లు, అధునాతన ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో విస్తృతంగా ఉపయోగిస్తారు. నియోడైమియం–ప్రసోడైమియం ఆక్సైడ్ నుంచి తుది మాగ్నెట్ వరకు దేశంలోనే అభివృద్ధి చేయడం ద్వారా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలని కేంద్రం భావిస్తోంది. దేశీయ తయారీని బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ మార్కెట్లో భారత్ పోటీతత్వాన్ని పెంచడం ఈ పథకం ఉద్దేశం.

## విదేశీ మార్కెట్లలో ఎస్‌బీఐకి భారీ నిధుల సమీకరణ

- 500 మిలియన్ డాలర్ల బాండ్ల జారీ.. 5.25 శాతం కూపన్ రేటు
- 2.46 బిలియన్ డాలర్లకు చేరిన ఆర్డర్ బుక్
- 145మంది అంతర్జాతీయ ఇన్వెస్టర్ల ఆసక్తి




**న్యూఢిల్లీ:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) విదేశీ మార్కెట్ల నుంచి 500 మిలియన్ డాలర్లను సమీకరించింది. లండన్ శాఖ ద్వారా 5.25 శాతం కూపన్ రేటుతో బాండ్లను జారీ చేసినట్లు బ్యాంకు గురువారం వెల్లడించింది. ఈ 'రెగ్యులేషన్ ఎస్' బాండ్లను ఐదేళ్ల అమెరికా ట్రెజరీ బాండ్లతో అనుసంధానించి, దానిపై 88 బేసిస్ పాయింట్ల స్ప్రెడ్‌తో ధర నిర్ణయించారు. బాండ్ల జారీకి అంతర్జాతీయ ఇన్వెస్టర్ల నుంచి విశేష స్పందన లభించింది. గరిష్ఠంగా 2.46 బిలియన్ డాలర్ల ఆర్డర్ బుక్ నమోదైంది. మొత్తం 145 మంది ఇన్వెస్టర్లు ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ బాండ్లను ఎస్‌జీఎక్స్–ఎస్‌టీ, ఇండియా ఐఎన్ఎక్స్, ఎన్ఎస్ఈ–ఐఎక్స్‌లలో లిస్ట్ చేయనున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ 500 మిలియన్ డాలర్ల బాండ్లను విజయవంతంగా ప్రైస్ చేయడం ఎస్‌బీఐపై అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ఉన్న బలమైన నమ్మకానికి నిదర్శనమని ఎస్‌బీఐ చైర్మన్ సి.ఎస్.శెట్టి అన్నారు. విదేశీ రుణ మార్కెట్లలో బ్యాంకుకు ఉన్న విభిన్నమైన ఇన్వెస్టర్ బేస్ ద్వారా ప్రపంచంలోని ప్రముఖ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్వెస్టర్ల నుంచి సమర్థంగా నిధులు సమీకరించగలుగుతున్నామని తెలిపారు. ఆర్‌బీఐ స్వాప్ విండో ప్రకటన తర్వాత భారత ప్రభుత్వ రంగ సంస్థలు జారీ చేసిన బాండ్లలో ఇదే అత్యంత తక్కువ స్ప్రెడ్‌తో ధర నిర్ణయించిన ఇష్యూ అని ఎస్‌బీఐ పేర్కొంది. భారత్ ఆర్థిక వృద్ధిపై, ఎస్‌బీఐ క్రెడిట్ నాణ్యతపై అంతర్జాతీయ ఇన్వెస్టర్లకు ఉన్న విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తోందని తెలిపింది.

## విజయవాడ నుంచి వారణాసి, కోల్‌కతాకు ఇండిగో విమానాలు

- వారానికి మూడు రోజులు సర్వీసులు
- తొలిరోజే ప్రయాణికుల నుంచి మంచి స్పందన
- త్వరలో పుణె, అహ్మదాబాద్, కొచ్చికి విమానాలు: కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు



**ప్రజానావ, మచిలీపట్నం:** విజయవాడ నుంచి వారణాసి, కోల్‌కతాలకు ఇండిగో కొత్త విమాన సర్వీసులను గురువారం ప్రారంభించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఈ సర్వీసులను ప్రారంభించారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగిన కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఇండిగో 6ఈ6501 విమానం కోల్‌కతా నుంచి మధ్యాహ్నం 2.10 గంటలకు బయలుదేరి 3.55 గంటలకు వారణాసి చేరుతుంది. అక్కడి నుంచి సాయంత్రం 5.50 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 6ఈ6502 విమానం విజయవాడ నుంచి సాయంత్రం 6.20 గంటలకు బయలుదేరి 8.15 గంటలకు వారణాసి, రాత్రి 10.15 గంటలకు కోల్‌కతా చేరుతుంది. ఈ సర్వీసులు మంగళ, గురు, శనివారాల్లో అందుబాటులో ఉంటాయి. తొలి రోజు వారణాసి నుంచి 89 మంది విజయవాడకు రాగా, విజయవాడ నుంచి 129 మంది వారణాసికి ప్రయాణించినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. కొత్త సర్వీసులతో ఆధ్యాత్మిక, వాణిజ్య, విద్య, వైద్యం, పర్యాటక అవసరాల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని ఎంపీ బాలశౌరి అన్నారు. విజయవాడ నుంచి దుబాయ్‌కు నేరుగా అంతర్జాతీయ విమాన సర్వీసు, కొచ్చికి విమానం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. దుబాయ్ కనెక్టివిటీ ద్వారా ఆఫ్రికా, అమెరికా, యూరప్ ప్రాంతాలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం లభిస్తుందని తెలిపారు.

### అంతర్జాతీయ కనెక్టివిటీపై దృష్టి

విజయవాడ విమానాశ్రయం నుంచి త్వరలో పుణె, అహ్మదాబాద్, కొచ్చికి విమానాలు అందుబాటులోకి వస్తాయని రామ్మోహన్ నాయుడు తెలిపారు. విజయవాడను ప్రధాన అంతర్జాతీయ హబ్‌లకు అనుసంధానించేలా 'హబ్ అండ్ స్పోక్' విధానాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. దీనివల్ల ప్రయాణికులు విజయవాడలోనే కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ పూర్తిచేసుకుని హబ్ విమానాశ్రయం నుంచి కనెక్టింగ్ విమానాల్లో ప్రయాణించవచ్చన్నారు.

## మిశ్రమంగా ముగిసిన మార్కెట్లు

- 114 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్.. 40 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం మిశ్రమంగా ముగిశాయి. ముడిచమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగడం, మధ్యప్రాచ్యంలో భౌగోళిక ఉద్రిక్తతలు నెలకొనడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. చివర్లో కొనుగోళ్లు పెరగడంతో సెన్సెక్స్ లాభాల్లో ముగియగా, నిఫ్టీ నష్టాల్లోనే కొనసాగింది. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 113.61 పాయింట్లు (0.15%) లాభపడి 78,079.96 వద్ద స్థిరపడింది. ఇంట్రా డేలో 78,119.39–77,665.89 మధ్య 453.5 పాయింట్ల మేర ఊగిసలాడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 40.10 పాయింట్లు (0.16%) తగ్గి 24,395.85 వద్ద ముగిసింది. దీంతో వరుసగా మూడో రోజూ నిఫ్టీ నష్టాలను చవిచూసింది. సెన్సెక్స్‌లో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఎన్‌టీపీసీ, భారత్ ఎలక్ట్రానిక్స్, ఎల్అండ్‌టీ, హిందుస్థాన్ యూనిలీవర్, ఎటర్నల్ లాభపడగా.. ఐసీఐసీఐ బ్యాంక్, టైటన్, రిలయన్స్ ఇండస్ట్రీస్, అల్ట్రాటెక్ సిమెంట్, ఇన్ఫోసిస్ నష్టపోయాయి.



# ఇక సినిమాల్లో అవకాశాలు రావనుకున్నా

నటి సమంత 'మా ఇంటి బంగారం'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ నటన, నిర్మాణ రంగం, యాక్షన్ పాత్రలపై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. యాక్షన్ సినిమాల్లో నటించడం అంత సులభమైన విషయం కాదని, అయితే ఫైటింగ్ సన్నివేశాల్లో నటించడం తనకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుందని తెలిపారు. సొంతంగా సినిమాలు నిర్మించడంపై కూడా సమంత స్పందించారు. నిర్మాణ రంగం తనకు ఇచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ నటనలో లభించలేదని చెప్పారు. మయోసైటిస్ వచ్చినట్లు తెలిసిన సమయంలో ఇకపై తనను సినిమాల్లో నటించడానికి నిర్మాతలు ఆలోచిస్తారేమోనన్న భయం కలిగిందని పేర్కొన్నారు. ''ఇక సినిమాల్లో అవకాశాలు రావేమో అనుకున్నా. కానీ ఇప్పుడు నేనే నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి సినిమాలు నిర్మిస్తున్నాను. వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాను. చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే కెమెరా ముందు మాత్రమే కాకుండా, కెమెరా వెనుక కూడా నాకు నచ్చిన పనులు చేస్తున్నాను'' అని సమంత తెలిపారు. ఇక యాక్షన్ పాత్రల విషయానికి వస్తే.. 'ది ఫ్యామిలీ మ్యాన్', 'సిటాడెల్: హనీ బన్నీ' సిరీస్‌లలో తాను చేసిన యాక్షన్ సన్నివేశాలకు మంచి స్పందన రావడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. సాధారణంగా హీరోయిన్లు యాక్షన్ సన్నివేశాల్లో నటిస్తే ప్రేక్షకులు అంత సులభంగా అంగీకరించరని, ఆ ధోరణిని మార్చాలని తాను కోరుకుంటున్నానని చెప్పారు. హీరోయిన్లు కూడా అన్ని రకాల పాత్రలు, యాక్షన్ సన్నివేశాలు చేయగలరని నిరూపించాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. సినిమాలో దెబ్బలు తింటూ, ఫైట్స్ చేస్తూ నటించడం తనకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుందని సమంత వెల్లడించారు.

# మిస్సింగ్ మేఘన.. పిల్లపిల్ల పిల్ల సాంగ్ రిలీజ్



టాలీవుడ్ చలనచిత్ర పరిశ్రమలో ప్రయోగాత్మక చిత్రాలతో పాటు సరికొత్త కథాంశాలతో ప్రేక్షకులను అలరించేందుకు వస్తోన్న తాజా థ్రిల్లర్ చిత్రం 'మిస్సింగ్ మేఘన'. ఫస్ట్ కాపి మూవీస్ మరియు డి / కో సంయుక్త బ్యానర్లపై పంచుమర్తి నరేష్ బాబు నిర్మాతగా వ్యవహరిస్తోన్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహిస్తున్నారు. రావ్ కార్తీక్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలు మరింత జోరందుకున్నాయి. సినిమాలోని ఫస్ట్ సింగిల్ అయిన 'పిల్ల పిల్ల పిల్ల' లిరికల్ సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను టాలీవుడ్ ప్రముఖ లెజెండరీ ప్రొడ్యూసర్ సురేష్ బాబు ప్రారంభించారు. రామానాయుడు స్టూడియోస్‌లో జరిగిన ఈ వేడుకకు నైపుణ్యం కలిగిన సినీ ప్రముఖులు, చిత్ర యూనిట్ సభ్యులు మరియు నిర్మాత బెక్కం వేణుగోపాల్ హాజరయ్యారు. సురేష్ బాబు తన గో÷—డలెన్ హ్యాండ్‌తో పాటను విడుదల చేసి చిత్ర బృందానికి ఘన విజయం సాధించాలని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ, సురేష్ ప్రొడక్షన్స్ కి ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఉన్న ప్రత్యేక స్థానం గురించి కొనియాడారు. తమ సినిమా ఫస్ట్ సాంగ్ సురేష్ బాబు గారి చేతుల మీదుగా లాంచ్ కావడం ఎంతో ఆనందంగా ఉందని, నన్ను నమ్మి అవకాశం కల్పించిన నిర్మాత నరేష్ బాబుకు, కో—ప్రొడ్యూసర్ శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రంలో అద్భుతమైన పాటలు అందించిన సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధ్రువన్‌కు మరియు ఈ పాటకు ప్రాణం పోసిన ప్రముఖ గాయకుడు జావేద్ అలీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నిర్మాత నరేష్ బాబు మాట్లాడుతూ, తమ సినిమా ప్రారంభోత్సవం డా రామానాయుడు స్టూడియోలోనే జరిగిందని, ఇప్పుడు అదే స్టూడియోలో లెజెండరీ ప్రొడ్యూసర్ సురేష్ బాబు చేతుల మీదుగా మొదటి పాట విడుదల కావడం సెంటిమెంట్‌గా చాలా సంతోషాన్నిస్తోందన్నారు. గతంలో వచ్చిన 'తంత్ర' సినిమా మ్యూజికల్ ఎంతటి విజయం సాధించిందో, ఈ సినిమా సంగీతం మరియు కథ డా అంతకంటే గొప్ప విజయాన్ని అందుకుంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధ్రువన్ మాట్లాడుతూ, ఈ బ్యానర్‌లో తాను చేస్తున్న రెండవ సినిమా ఇదనీ, తానే స్వయంగా పాట రాసి, సంగీతం అందించి, తన ఫేవరెట్ సింగర్ జావేద్ అలీతో పాడించడం మరపురాని అనుభూతి అని తెలిపారు. చక్కని థ్రిల్లర్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులందరినీ ఖచ్చితంగా అలరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీవ్, పందు తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# అసభ్యకరమైన పోస్టులు తొలగించండి



ప్రముఖ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పేరు, ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు, ఏఐ ద్వారా సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తున్నారని ఆమె తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు. అయితే ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూప్ జైరావ్ భంభాని కీలక ఆదేశాలు జారీ చేశారు. అసభ్యకరంగా ఉన్న కంటెంట్‌ను, అలాగే ఎవరైనా ఆమె పేరును వాణిజ్యపరంగా దుర్వినియోగం చేస్తుంటే ఆ పోస్టులను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. పర్సనాలిటీ రైట్స్ అనే భావనకు ఒక సరైన హద్దు ఉండాలని, సెలబ్రిటీల హక్కులను రక్షించడంతోపాటు భావప్రకటన స్వేచ్ఛను డా సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అన్ని ఫ్యాన్ పేజీలపై ఒసారి నిషేధం విధించలేమని కోర్టు పేర్కొంది. వలం వాణిజ్య ప్రయోజనాల కోసం లేదా డబ్బు సంపాదనే లక్ష్యంగా ఎవరైనా ఆమె పేరును వాడుకుంటేనే కచ్చితంగా చర్యలు తీసుకోవచ్చునని, అయితే అన్ని ఫ్యాన్ పేజీలను నేరపూరితమైనవిగా పరిగణించలేమని తెలిపారు. కొందరు వ్యంగ్యంగా లేదా విమర్శనాత్మక ధోరణిలో డా పోస్టులు చేసే అవకాశం ఉందని న్యాయమూర్తి గుర్తుచేశారు. ఈ సులో మెటా తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ తరఫున ఇప్పటి 4,000కు పైగా యూఆర్ఎల్‌లను సమర్పించారని, అయితే ఆ కంటెంట్ అంతా ఒలా అభ్యంతరకరంగా లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో, ఆరోపణలు ఎదుర్కొంటున్న కంటెంట్‌ను స్పష్టమైన వర్గాలుగా విభజించి తదుపరి విచారణకు కోర్టు ముందుంచాలని పిటిషనర్ తరఫు న్యాయవాదిని న్యాయమూర్తి ఆదేశించారు. గతంలో డా పలువురు ప్రముఖ నటీనటులు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు తమ వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

# 4న వస్తోన్న క్రైమ్ థ్రిల్లర్ 'మీర్జాపూర్'



భారతీయ ఓటీటీ చరిత్రలో సంచలనం సృష్టించ డంతో పాటు అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించేం దుకు సిద్ధమైంది. అమెజాన్ ఎమ్‌జీఎం స్టూడియోస్ మరియు ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై రితేష్ సిధ్వాని, ఫర్హాన్ అక్తర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి గుర్‌మీత్ సింగ్ దర్శకత్వం వహిస్తుండగా, సిరీస్‌లో అదరగొట్టిన ప్రధాన నటీనటులందరూ మళ్లీ పెద్ద తెరపై తమ విశ్వరూపం చూపించడానికి వస్తున్నారు. 'సింహాసనం అనేది రాజకీయాల ద్వారా రాదు, అలా అని వంశపారంపర్యంగానూ రాదు? వలం బాహుబలం ఉంటేనే సింహాసనం దక్కుతుంది అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో ట్రైలర్ ఆకట్టుకుంటుంది. ఓటీటీలో వెబ్ సిరీస్‌గా ప్రేక్షకుల ను అలరించిన ఈ నేర ప్రపంచాన్ని, మరింత భారీ హంగు లతో, అత్యున్నత నిర్మాణ విలువలతో వెండితెర కోసం మలిచారు. గతంలో సిరీస్‌లో మరణించినట్లు చూపించిన మున్నా భయ్యా (దివ్యేందు) పాత్ర ఈ చిత్రంలో మళ్లీ రీఎంట్రీ ఇస్తుండటం అభిమానులకు అసలైన విందుగా మారనుంది. ఇక మిర్జాపూర్ సింహాసనం కోసం జరిగే పోరులో కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డూ పండిట్ (అలీ ఫజల్) మరియు మున్నా భయ్యా మధ్య జరిగే రక్తపాతంతో డిన పోరాటం ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, దివ్యేందులతో పాటు శ్వేతా త్రిపాఠి, రసికా దుగ్గల్, అభిషేక్ బెనర్జీ, జితేంద్ర కుమార్, రవి కిషన్ మరియు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# గతంలో జరిగిన తప్పులకు క్షమించండి

తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్, డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార వేడుకలో ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ చేసిన వ్యాఖ్యలు టాలీవుడ్‌లో హాట్ పిక్‌గా మారాయి. గతంలో ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్‌తో తలెత్తిన విభేదాలు మరియు వివాదాల పట్ల జానీ మాస్టర్ బహిరంగంగా క్షమాపణలు కోరారు. గత కాలపు పొరపాట్లను పక్కనపెట్టి మళ్లీ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించుకున్నామని, కొంతకాలం అసోసియేషన్‌కు దూరంగా ఉన్నప్పటికీ మళ్లీ అందరితో కలిసి పనిచేసేందుకు వచ్చానని ఆయన స్పష్టం చేశారు. ఇకపై అందరం ఒ కుటుంబంలా కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నిర్మాతలు ఇచ్చే పారితోషికాలు డ్యాన్సర్లకు పూర్తిగా అందడం లేదనే తీవ్ర ఆవేదనతోనే గతంలో తాను మాట్లాడాల్సి వచ్చిందని ఆయన వెల్లడించారు. ఇదే అంశంపై మెగాస్టార్ చిరంజీవిని కలిసిన ప్పుడు, ఆయన ఎంతో సానులంగా స్పందించి సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో తన మాటల ద్వారా ఎవరికైనా మనస్తాపం కలిగి ఉంటే, లేదా తెలిసీ తెలియక ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే పెద్ద మనసుతో క్షమించాలని ఇండస్ట్రీ పెద్దలను జానీ మాస్టర్ కోరారు. తండ్రి కోప్పడినా చివరికి పిల్లల ను దగ్గరకు తీసుకున్నట్లే, సినీ పరిశ్రమ పెద్దలు మరియు నిర్మాతల మండలి డ్యాన్సర్ల అసోసియేష న్‌ను కలుపుకొని ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆ రిలేషన్‌షిప్‌లో ఏం జరిగిందంటే?



యంగ్ హీరోయిన్ అను పమ పరమేశ్వరన్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కీలక విషయాలను తాజాగా వెల్లడించ డం సినీ వర్గాల్లో చర్చనీయాం శంగా మారింది. గత కొంతకాలం గా ఓ ప్రముఖ యువ హీరోతో ఆమె ప్రేమలో ఉన్నా రంటూ ప్రచా రం జరిగిన విషయం తెలిసిందే. అయితే తాజాగా తన గత బంధం గురించి అను పమ చేసిన వ్యాఖ్యలు ఈ వార్తలకు మరింత ప్రాధా న్యం తెచ్చాయి. తాను గతంలో ఓ విషపూరి తమైన బంధంలో చిక్కుకు న్నానని అనుపమ వెల్లడించారు. ఆ సంబంధం కారణం గా దాదాపు రెండేళ్లపాటు మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నానని, క్రమంగా తనను తాను కోల్పో యినట్లు అని పించిందని ఆమె తెలిపారు. తన మాజీ భాగస్వామి ప్రవర్త నలో అనూహ్యమైన మార్పు లు కనిపించేవని, అందుకే అతడిని 'అపరిచితుడు' తర హాలో పోల్చినట్లు సమాచా రం. సంబంధం ప్రారంభ మైన కేవలం మూడు నెల ల్లోనే ఇరు కుటుం బాల్లో పెళ్లి గురించి చర్చలు కూడా మొద లయ్యాయని ఆమె వెల్లడించినట్లు సమాచారం. అయితే అనుపమ తన మాజీ భాగస్వామి పేరును ఎక్కడా ప్రస్తావించలేదు. గతంలో ఆమె కు ఓ యువ హీరోతో ఉన్నట్లు ప్రచారం జరిగిన ప్పటికీ, తాజా వ్యాఖ్యల్లో ఎవరినీ నేరుగా ఉద్దేశించి మాట్లాడలేదు. దీంతో ఆమె చెప్పిన ఆ మాజీ ప్రియు డు ఎవరనే దానిపై సోషల్ మీడి యాలో కొత్త చర్చ మొద లైంది. కాగా, తన గత అనుభ వాల నుంచి బయట పడి ప్రస్తుతం ప్రశాంతంగా జీవి తాన్ని కొనసాగిస్తున్నానని అనుపమ పేర్కొన్నట్లు సమాచారం.

# త్రిష పోస్టులు వైరల్.. ఆ వెంటనే మాయం!



ప్రముఖ నటి త్రిష మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల డీఎంకే నేత, తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పరోక్షంగా ఆమెను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారనే ప్రచారం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున సాగింది. ఈ నేపథ్యంలో త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో చేసిన కొన్ని పోస్టులు వైరల్‌గా మారగా, అవి కొద్ది గంటల్లోనే కనిపించకుండా పోవడం కొత్త చర్చకు దారితీసింది. దీంతో ఆమె పోస్టులు ఎవరిని ఉద్దేశించి చేశారనే అంశంపై నెటిజన్లు విస్తృతంగా చర్చిస్తున్నారు. త్రిష తన అమ్మమ్మ 98వ పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టా స్టోరీలో పంచుకున్నారు. అదే సమయంలో కొన్ని ఆలోచనాత్మక కొటేషన్లను కూడా షేర్ చేశారు. వాటిలో 'ఈ వయసులో ఇలాంటి నాటకీయత సిగ్గుచేటు. వెళ్లి కొంత డబ్బు సంపాదించి, ప్రశాంతతను కనుక్కోండి' అనే వ్యాఖ్యతో పాటు, 'ఒకప్పుడు మీరు ప్రార్థించిన జీవితం ఇప్పుడు మీకు లభించడం ఎంత అదృష్టమో' అనే సందేశం కూడా ఉంది. ఈ పోస్టులు ఎవరిని ఉద్దేశించి చేశారనే విషయాన్ని త్రిష ఎక్కడా స్పష్టం చేయలేదు. అయితే ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ, సినీ పరిణామాల నేపథ్యంలో వీటిని పలువురు వివిధ కోణాల్లో విశ్లేషించారు. అయితే సాధారణంగా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలు 24 గంటలపాటు అందుబాటులో ఉంటాయి. కానీ త్రిష షేర్ చేసిన ఈ పోస్టులు అంతకుముందే కనిపించకుండా పోవడంతో ఆమె స్వయంగా వాటిని తొలగించారా లేదా ఇతర కారణాల వల్ల మాయమయ్యాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.